




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 341 పేజీలు : 8+8 ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి శనివారం 26 జూలై 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## మోదీ ప్రభుత్వం కుట్రతోనే జనగణనను ఆపేసింది



హైదరాబాద్ పెన్ పవర్::దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కులగణను చేపట్టాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. జనగణనతోనే దేశం ఎక్స్ రే, స్కానింగ్ రిపోర్టు తెలుస్తుంది..సరైన డేటా ఉన్నప్పుడే ఎవరి ప్రాతినధ్యం ఎంతనేది తెలుస్తుందన్నారు. దేశంలో కుల, మత రాజకీయాలు పెరిగాయ్.. మోదీ ప్రజల ప్రభుత్వం ప్రజల మధ్య విద్వేషాలు పెంచుతోంది..

వివరాలు 2లో..

## తెలంగాణ మంత్రిమండలి సమావేశం వాయిదా



హైదరాబాద్ పెన్ పవర్: సచివాలయంలో ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్య క్షతన శు క్రవారం నిర్వహిం చాల్సిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం వాయిదా పడింది. ఏఐసీసీ సమావేశంలో పాల్గొనేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి ఢిల్లీలోనే ఉన్నారు. వీరితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఐదుగురు మంత్రులు ఢిల్లీలోనే ఉండటంతో క్యాబినెట్ సమావేశం వాయిదా వేయాలని సీఎం నిర్ణయించారు. ఈనెల 28న మధ్యాహ్నం 2 గంటలకు క్యాబినెట్ భేటీ నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## హెచ్‌సీఏ ప్రధాన కార్యదర్శి దేవరాజ్ అరెస్టు




- పుణేలో అదుపులోకి తీసుకున్న సీఐడీ పోలీసులు
- హెచ్‌సీఏ అక్రమాల కేసులో ఏ2గా ఉన్న దేవరాజ్
- దేవరాజ్‌తో ఆరుకు చేరిన అరెస్టైన వారి సంఖ్య

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో చోటుచేసుకున్న అవినీతి వ్యవహారాల కేసులో సంస్థ ప్రధాన కార్యదర్శి దేవరాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సీఐడీ అధికారులు అతడిని పుణేలో అదుపులోకి తీసుకున్నారు. హెచ్‌సీఏ అక్రమాల కేసులో దేవరాజ్ ఏ2గా ఉన్నారు. తాజా అరెస్టుతో ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య ఆరుకు చేరింది. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావును పోలీసులు ఇదివరకే అరెస్టు చేశారు. నకిలీ పత్రాలను సమర్పించి ఆయన అధ్యక్ష పదవిని పొందినట్లు ఆరోపణలు రావడంతో

వివరాలు 2లో..

## 'కన్వర్టెడ్ బీసీ' అనే పదాన్ని రేవంత్ రెడ్డి కొత్తగా తీసుకు వచ్చారు

- నరేంద్ర మోదీ బీసీ కాదంటూ బీసీ సమాజాన్ని అవమానించారని విమర్శ
- రాహుల్ గాంధీ గురించి అడిగితే కాంగ్రెస్ నేతలు ఏం చెబుతారని ప్రశ్న
- ఆయనకు గోబెల్స్ బహుమతి ఇవ్వాలని చురక




హైదరాబాద్ పెన్ పవర్:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీసీ కాదంటూ బీసీ సమాజాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానించారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. రాహుల్ గాంధీ గురించి అడిగితే కాంగ్రెస్ నాయకులు ఏం చెబుతారని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, మోదీ కన్వర్టెడ్ బీసీ అనే పదాన్ని రేవంత్ రెడ్డి కొత్తగా తీసుకు వచ్చారని విమర్శించారు. అందుకు ఆయనకు గోబెల్స్ బహుమతి ఇవ్వాలని ఎద్దేవా చేశారు. రాష్ట్ర బీజేపీ కమిటీలో 20 పోస్టులు మాత్రమే ఉన్నాయని రామచందర్ రావు అన్నారు. ఎనిమిది మంది ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, ఏడుగురు కార్యదర్శులు, ఒక కోశాధికారి పోస్టు

వివరాలు 2లో..

# బీసీ రిజర్వేషన్లపై బీజేపీలో కన్‌ఫ్యూజన్

- తొమ్మిదో షెడ్యూల్ పెట్టేందుకు అభ్యంతరం లేదన్న కేంద్ర మంత్రి
- 42% నుంచి ముస్లింలను తొలగించాలంటున్న కిషన్ రెడ్డి
- 9వ షెడ్యూల్ పేరుతో కేంద్రంపై నిందలు వేయొద్దన్న రాంచందర్ రావు
- 42 శాతం రిజర్వేషన్ల హామీని ఎలా ఇచ్చారో అలానే అమలు చేయాలన్న బీజేపీ స్టేట్ చీఫ్?
- అసెంబ్లీ తీర్మానానికి మద్దతు ఇచ్చిన బీజేపీ ఎమ్మెల్యేలు
- మంత్రిపదవులను ప్రస్తావిస్తూ రఘునందన్ రావు విమర్శలు




హైదరాబాద్ పెన్ పవర్:: బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నేతలు తలోమాట మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, హామీ ఇచ్చినప్పుడు 42% రిజర్వేషన్ ఇవ్వడం సాధ్యం కాదని తెలియదా..? అని విమర్శి స్తోంది. బీసీలను మోసం చేయాలని చూస్తోందని అంటోంది. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానానికి మద్దతు పలికి ఇప్పుడు సాధ్యం కాదనడం గమనార్హం. 42% సాధ్యం కాదని భావిస్తే అప్పుడే ఎందుకు వ్యతిరేకించలేదని కాంగ్రెస్ అంటోంది. ఇవాళ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ' 42శాతం రిజర్వేషన్లు బీసీలకు మాత్రమే ఇవ్వాలి. అందులోంచి ముస్లింలను తీసేయాలి. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టేందుకు మాకు అభ్యంతరం లేదు కానీ చట్టానికి లోబడి ఉండాలి. ' అని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముస్లింలకు బీసీ–ఈ కింద 4 శాతం రిజర్వేషన్లు కల్పించనప్పుడు హైకోర్టు ధర్మాసనం ఆ రిజర్వేషన్లు చెల్లవని రెండు సార్లు తీర్పును ఇచ్చిందన్నారు. దానిపై స్టే తీసుకొచ్చి 4 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందని తెలిపారు. ఇప్పుడు ముస్లింలకు ఉన్న 4 శాతం రిజర్వేషన్లను 10 శాతానికి పెంచి బీసీలకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. ఇటీవల బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్ లో చేర్చడం సాధ్యం కాదని, ఇప్పటికే తమిళనాడు కేసు సుప్రీంకోర్టులో

వివరాలు 2లో..

## ఏపీ, తెలంగాణ డీలిమిటేషన్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు




- రెండు తెలుగు రాష్ట్రాల్లో డీలిమిటేషన్‌పై పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత
- ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం
- నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని 2022లో పిటిషన్ దాఖలు
- ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారణ
- 2026లో మొదటి జనగణన లెక్కల తర్వాతే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా ఉందని వ్యాఖ్య

వివరాలు 2లో..

## మోదీ విదేశీ పర్యటనలు.. మూడేళ్లలో రూ.295 కోట్ల ఖర్చు

- ఒక్క ఫ్రాన్స్ పర్యటనకే రూ.25 కోట్లు
- ఇటీవలి ఐదు దేశాల పర్యటనకు రూ.67 కోట్లు
- రాజ్యసభలో కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలకు సంబంధించి గత మూడేళ్లలో రూ.295 కోట్లు ఖర్చుయిందని కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది. ఈ మేరకు గురువారం రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ఇందులో మోదీ పర్యటనలకు సంబంధించి ఏ దేశానికి వెళ్లినపుడు ఎంత ఖర్చుయిందనే వివరాలను ఆయన వెల్లడించారు. 2021 నుంచి 2024 మధ్య కాలంలో ప్రధాని మోదీ విదేశీ పర్యటనల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి దాదాపు రూ.295 కోట్లు వెచ్చించినట్లు మంత్రి తెలిపారు. ఇందులో ఒక్క ఫ్రాన్స్ పర్యటన (2025) కే రూ.25 కోట్లు ఖర్చుయిందని వివరించారు. 2023 జూన్ లో మోదీ అమెరికా పర్యటనకు రూ.22 కోట్లు ఖర్చుయింద న్నారు. ఇటీవల మోదీ ఐదు దేశాలలో

వివరాలు 2లో..

## రఘునందన్ రావు ఆ విషయంలో ఎందుకు ఒత్తిడి చేయడం లేదు

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కావొద్దని రఘునందన్ రావు కోరుకుంటున్నారని విమర్శ
- బిల్లుకు ఆమోదం తెలపకుండా బీజేపీ నేతలు అనవసర మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం
- రేవంత్ రెడ్డి బీసీ బిడ్డ కాకపోయినా బిల్లు తీసుకు వచ్చారన్న ఆది శ్రీనివాస్



హైదరాబాద్ పెన్ పవర్:బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వం, బీజేపీ అధిష్ఠానాన్ని ఎంపీ రఘునందన్ రావు ఎందుకు ఒత్తిడి చేయటం లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. బీజేపీ అగ్రకుల పార్టీ అని, బీసీ బిల్లుకు ఆమోదం తెలపకుండా ఆ పార్టీ నేతలు అనవసరమైన మాటలు

వివరాలు 2లో..

## 24 గంటలు, 365 రోజులు భారత్ అప్రమత్తంగా ఉండాలి

- పాకిస్థాన్ ఎలాంటి దుస్సహాసానికి ఒడిగట్టినా మన దళాలు అప్రమత్తంగా ఉండాలన్న సీడీఎస్
- ఆయుధాలు, ఇతర పరిజ్ఞానం గురించి మిలిటరీ అప్‌డేట్‌గా ఉండాలని సూచన
- ఢిల్లీలో జరిగిన డిఫెన్స్ సెమినార్‌లో మాట్లాడిన అనిల్ చౌహాన్



పెన్ పవర్ డెస్క్:భారతదేశం ఎల్లప్పుడూ అప్రమ త్తంగా ఉండాలని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్ కొనసాగు తోందని, పాకిస్థాన్ ఎటువంటి దుస్సాహసానికి ఒడిగట్టినా మన దళాలు 365 రోజులు, 24 గం టలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. ఢిల్లీలో జరిగిన డిఫెన్స్ సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ, సాంకేతికత అభివృద్ధి చెందిందని, సైన్యం కూడా ఎప్పటికప్పుడు వ్యూహాత్మకత, కార్యాచరణ,

వివరాలు 2లో..

## రాజ్యసభ ఎంపీగా కమల్ హాసన్ ప్రమాణస్వీకారం

- తమిళంలో ప్రమాణం చేసిన కమల్ హాసన్
- జూన్‌లో డీఎంకే కూటమి మద్దతుతో రాజ్యసభ ఎంపీగా కమల్ ఏకగ్రీవంగా ఎన్నిక
- ఆయనతో పాటు విల్సన్, సల్మా, ఎస్.ఆర్. శివలింగం ఎంపీలుగా ప్రమాణం



పెన్ పవర్ డెస్క్:పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వరుసగా ఐదోరోజు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు ఉభయసభలు సమావేశమ య్యాయి. సభ ప్రారంభం కాగానే ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీ అధినేత కమల్ హాసన్ ఎంపీగా ప్రమాణస్వీకారం చేశారు. తమిళంలో ఆయన ప్రమాణం చేశారు.కాగా, జూన్‌లో డీఎంకే కూటమి మద్దతుతో కమల్ రాజ్యసభ ఎంపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఆయనతో పాటు డీఎంకే నుంచి పి. విల్సన్, సల్మా, ఎస్.ఆర్. శివలింగం కూడా ఎంపీలుగా ఎన్నికయ్యారు. వారు కూడా తాజాగా ప్రమాణస్వీకారం చేశారు. ఇక, 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించిన కమల్ హాసన్... 2021 తమిళనాడులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమికి

వివరాలు 2లో..

## ధవళేశ్వరం వద్ద గోదావరి వరద ఉధృతి..



హైదరాబాద్ పెన్ పవర్::తెలుగు రాష్ట్రాలతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. వరద ఉధృతి పెరగడంతో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 175 గేట్లను ఎత్తి అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 2,16,300 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేసినట్లు తెలిపారు.

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో చాలా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా మిగతా చోట్ల కూడా ముసురు వాతావరణం నెలకొంది.రెండు రాష్ట్రాల్లోని వాగులు, వంకలు, నదులకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. తూర్పు గోదావరి జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాల కారణంగా లంక గ్రామాల్లోకి వరద నీరు చేరింది. రాబోయే మూడ్రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

## ఎడిటర్ వ్యూ

# పవన్ సర్వేలో అదే తేలిందా? ఇలాగయితే కష్టమేనా?

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వచ్చే నెల నుంచి పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టనున్నారు. పదవులపైన కూడా క్లారిటీ ఇచ్చే అవకాశముంది. పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పదవుల విషయంలోనూ జనసేనాని కొంత కసరత్తులు చేస్తున్నట్లు సమాచారం. ఇన్నాళ్లూ సినిమా షూటింగ్ లలో బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్ ఇక పార్టీకి 2014 నాటి హైప్ తెచ్చే ప్రయత్నంలో ఉన్నారట. ఇందుకోసం అనేక నియోజకవర్గాల్లో సర్వేలు కూడా చేయిస్తున్నారు. తమకు పట్టున్న జిల్లాల్లో కొంత పార్టీని మరింత బలోపేతం చేసిన తర్వాత మిగిలిన నియోజకవర్గాలకు పార్టీని విస్తరించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ తన ఇమేజ్ ఏ మాత్రం తగ్గకుండా చేస్తున్న ప్రయత్నాలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలన్న ప్రయత్నంలో ఉన్నారు.

**ప్రభుత్వ నిర్ణయాలను...**

అవసరమైతే ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించడానికి కూడా సిద్ధమయినట్లు కనిపిస్తుంది. ఇటీవల మీడియాలకు ఇంటర్వ్యూలు ఇస్తూ కూటమిలో అన్ని పార్టీలు సమన్వయంతో కలసి పనిచేస్తున్నాయని చెప్పిన పవన్ కళ్యాణ్ రాజధాని అమరావతి భూములు అదనంగా సేకరించే విషయంలో మాత్రం తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టేశారు. రాజధానికి అదనపు భూమిని ఇవ్వడంలో బలవంతం ఏమీ లేదని, ఇష్టపూర్వకంగా ఇస్తేనే ప్రభుత్వం తీసుకుంటుందని, బలవంతంగా మాత్రం తీసుకోదని ప్రభుత్వం తరుపున చెప్పారంటే ఆయన అదనపు భూ సేకరణను వ్యతిరేకించినట్లే కనపడుతుంది. రాజధాని రైతుల్లో నెలకొన్న అసంతృప్తిని ఆయన గమనించి ఈ వ్యాఖ్యలు చేసినట్లు కనిపిస్తుంది.

**ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను...**

జనసేన ఎమ్మెల్యేలతో పాటు కూటమి పార్టీల్లోని ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను కూడా ఆయన పసిగట్టినట్లు సమాచారం. స్థానికంగా సమస్యలను పరిష్కరించలేకపోతుండటంతో నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేల పనితీరు పట్ల అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. జనసేనకు చెందిన ఇరవై మంది ఎమ్మెల్యేల్లో దాదాపు పదిహేను మంది ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉన్నట్లు సర్వే ద్వారా తేలడంతో వారిని పిలిచి క్లాస్ పీకేందుకు సిద్ధమయ్యారని చెబుతున్నారు. త్వరలోనే ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి రానున్న నాలుగేళ్ల పాటు కష్టపడి పనిచేసి మంచి మార్కులు తెచ్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు దక్కవన్న హెచ్చరికలు కూడా పవన్ జారీ చేసే అవకాశముందని తెలిసింది. మొత్తం మీద ఆగస్టు నెలలో ఎమ్మెల్యేలకు పవన్ కళ్యాణ్ సీరియస్ గానే వార్నింగ్ ఇచ్చే అవకాశముంది.

# బీసీ రిజర్వేషన్లపై బీజేపీలో కన్ఫ్యూజన్

- మొదటి పేజీ తరువాయి

పెండింగ్ లో ఉందని చెప్పారు. ఈ విషయం ముందే తెలిస్తే బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో బిల్లును ఎందుకు వ్యతిరేకించలేదని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. బీసీలను మోసం చేస్తున్నది బీజేపీయేనని విమర్శిస్తోంది.

బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి లేదని అంటోంది. ఇవాళ ఉదయం బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. తెలంగాణలో 10 శాతం లేని అగ్రకులాలకు 7 మంత్రి పదవులు ఎందుకు ఉన్నాయో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలంటున్నారు. 56 శాతం ఉన్న బీసీలకు మూడు మంత్రి పదవులు ఎందుకు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. బీజేపీ వైపుకు ఒక్క వేలు చూపెడుతున్న రేవంత్ రెడ్డి.. ఆయన వైపు 4 వేళ్లు చూపెడుతున్నాయని తెలుసుకోవాలన్నారు. శాస్త్రీయంగా కుల సర్వే నిర్వహించినప్పుడు ఎవరు ఎంతమంది ఉన్నారో.. పూర్తి వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా గవర్నర్ కు రాష్ట్ర కేబినెట్ పంపిన ఆర్డినెన్స్ ఇప్పుడు కేంద్ర హోంశాఖ వద్ద పెండింగ్ లో ఉందన్నారు.

# ఏపీ, తెలంగాణ డీలిమిటేషన్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

- మొదటి పేజీ తరువాయి

ఏపీ, తెలంగాణ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజనపై ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి 2022లో పిటిషన్ దాఖలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో పునర్విభజన సమయంలో.. ఏపీ విభజన చట్టాన్ని పక్కన పెట్టేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ రోజు విచారణ చేపట్టింది. రాజ్యాంగంలోని 170(3) అధికరణం ప్రకారం ఏపీ విభజన చట్టంలోని సెక్షన్ 26కు పరిమితి ఉందని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తు చేసింది. 2026లో మొదటి జనగణన లెక్కల తర్వాతే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా చెప్పారని పేర్కొంది. ఇలాంటి వ్యాజ్యాన్ని అనుమతించడం వల్ల మిగతా రాష్ట్రాల నుంచి కూడా నియోజకవర్గాల పునర్విభజనపై పిటిషన్లు వచ్చే అవకాశం ఉందని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. కేంద్రపాలిత ప్రాంతాలతో పోల్చినప్పుడు

రాష్ట్రాలలో డీలిమిటేషన్‌కు సంబంధించిన నిబంధనలు భిన్నంగా ఉంటాయని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. జమ్మూకశ్మీర్‌పై ప్రత్యేక దృష్టిసారించారన్న వాదనను కూడా ధర్మాసనం తిరస్కరించింది. జమ్మూకశ్మీర్ కోసం జారీ చేసిన నియోజకవర్గాల పునర్విభజన నోటిఫికేషన్ నుంచి మినహాయించడం.. ఏకపక్షం, వివక్షం కాదని చెబుతూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

# మోదీ ప్రభుత్వం కుట్రతోనే జనగణనను ఆపేసింది

- మొదటి పేజీ తరువాయి

కుట్ర పూరితంగానే మోదీ ప్రభుత్వం జనగణన ఆపేసిందని రాహుల్ విమర్శించారు. తెలంగాణలో కులగణన దేశానికే రోల్ మోడల్ అన్నారు రాహుల్. కాంగ్రెస్ హయాంలో తెలంగాణలో కులగణన విజయవంతంగా నిర్వహించాం.. కులగణన డేటా దేశంలో కేవలం తెలంగాణ సర్కార్ దగ్గర మాత్రమే ఉంది.. తెలంగాణలో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల డేటా ఉంది.. సరైన డేటా ఉన్నప్పుడే ఏదైనా చేయగలమన్నారు రాహుల్ గాంధీ. దళిత, గిరిజనులు అభివృద్ధి చెందొద్దని కుట్ర జరుగుతోందన్నారు రాహుల్ గాంధీ. దళిత, గిరిజనుల నిధులను కేంద్రం దారి మళ్లిస్తోందని ఆరోపించారు. దళిత గిరిజనులను అంటరాని వారిగా చూస్తున్నారు..ఇంగ్లీషును దళిత, గిరిజన విద్యార్థులకు దూరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. దళిత గిరిజనుల సంపదను అదానీ , అంబానీలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని అన్నారు రాహుల్ గాంధీ.

ఓబీసీ చరిత్రను %=ూా, దీజ్రూ% అణచివేస్తుందన్నారు రాహుల్ గాంధీ. కేంద్ర బడ్జెట్ లోనూ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయమే జరుగుతోందన్నారు రాహుల్ గాంధీ. దళిత ఓబీసీలకు రిజర్వేషన్లలోనూ న్యాయం జరగడం లేదు..దేశంలో ఏ సంస్థలోనూ బడుగు బలహీన వర్గాలకు సరైన ప్రాతినిధ్యం లేదన్నారు.

# రఘునందన్ రావు ఆ విషయంలో ఎందుకు ఒత్తిడి చేయడం లేదు

- మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతున్నారని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కాకూడదని రఘునందన్ రావు కోరుకుంటున్నారని ఆయన అన్నారు. తమ పీసీసీ అధ్యక్షుడు బీసీ బిడ్డ అని పేర్కొన్న ఆది శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎవరో చెప్పాలని ప్రశ్నించారు. బీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వాలని మీ అధిష్ఠానాన్ని ఎందుకు డిమాండ్ చేయడం లేదో చెప్పాలని నిలదీశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు తాము కట్టుబడి ఉన్నామని ఆయన వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో వారికి అన్ని అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి బీసీ బిడ్డ కాకపోయినప్పటికీ బీసీ రిజర్వేషన్ బిల్లును తీసుకు వచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి రఘునందన్ రావు పాఠాలు చెప్పవలసిన అవసరం లేదని ఆది శ్రీనివాస్ అన్నారు. సామాజిక

న్యాయం అంటేనే కాంగ్రెస్ అని ఆయన పేర్కొన్నారు. బీజేపీ వల్ల కాకపోతే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యాక బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదింప చేసుకుంటామని ఆది శ్రీనివాస్ అన్నారు.

# ప్రైవేట్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణకు తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం



హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేట్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణకు తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేట్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణ కోసం రెగ్యులరేషన్ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు శుక్రవారం (జూలై 25) ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 9 మందితో ఏర్పాటైన ఈ రెగ్యులరేషన్ కమిటీ చైర్మన్?గా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి నియమితులయ్యారు. 2025 నుంచి 28 మధ్య పారామీటర్స్ పరిగణలోకి తీసుకుని రిపోర్ట్ ఇవ్వాలని కమిటీని ఆదేశించింది ప్రభుత్వం. ఈ కమిటీ అధికారులు, ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలతో చర్చించి ఫీజుల నియంత్రణకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ఈ కమిటీ సిఫారసుల ఆధారంగా ప్రైవేట్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణపై తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకోనుంది.

# హెచ్‌సీఏ ప్రధాన కార్యదర్శి దేవరాజ్ అరెస్టు

- మొదటి పేజీ తరువాయి

అరెస్టు చేసినట్లు సీఐడీ అధికారులు పదిహేను రోజుల క్రితం వెల్లడించారు. ఆయనతో పాటు మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకున్నారు. తాజాగా మరొకరిని అరెస్టు చేశారు.

# 'కన్వర్టెడ్ బీసీ' అనే పదాన్ని రేవంత్ రెడ్డి కొత్తగా తీసుకు వచ్చారు

- మొదటి పేజీ తరువాయి

ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ కుటుంబ పార్టీ అయినందువల్లే జంబో కమిటీ ఉంటుందని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లుగా తనకు ఎలాంటి రాష్ట్ర పదవి లేదని, ఇప్పుడు అధ్యక్షుడిగా ఎన్నికయ్యానని అన్నారు.

# 24 గంటలు, 365 రోజులు భారత్ అప్రమత్తంగా ఉండాలి

- మొదటి పేజీ తరువాయి

నైపుణ్యాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆయుధాలు, ఇతర పరిజ్ఞానం గురించి సైన్యం పూర్తిగా అప్‌డేట్ అయి ఉండాలని సూచించారు.యుద్ధాల గతి మారిపోతోందని సీడీఎస్ వెల్లడించారు. భవిష్యత్తులో దళాల్లో ఇన్ఫో-టెక్‌తో పాటు స్కాలర్ వారియర్స్ కలగలిసి ఉంటారని అనిల్ చౌహాన్ అన్నారు. ఏం జరగబోతున్నా మనం ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలని ఆయన ఉద్ఘాటించారు.

# రాజ్యసభ ఎంపీగా కమల్ హాసన్ ప్రమాణస్వీకారం

- మొదటి పేజీ తరువాయి

మద్దతు ప్రకటిస్తూ.. డీఎంకేకు తమ పార్టీ మద్దతును ప్రకటించారు. ఈ ఎన్నికల్లో కూటమి విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. డీఎంకే పార్టీ తమిళనాడులో తమ పార్టీ జెండా ఎగురవేసింది. ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీలో డీఎంకేకు 134 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో నాలుగు రాజ్యసభ స్థానాలనూ ఆ పార్టీనే దక్కించుకుంది. పొత్తులో భాగంగా 2025 రాజ్యసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వంలోని కూటమి అంగీకరించింది. ఈ నేపథ్యంలో కమల్ హాసన్ రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# మోదీ విదేశీ పర్యటనలు.. మూడేళ్లలో రూ.295 కోట్ల ఖర్చు

- మొదటి పేజీ తరువాయి

పర్యటించగా దీనికోసం రూ.67 కోట్లు ఖర్చయిందని తెలిపారు. ఈ ఏడాదిలో మోదీ మారిషస్, సైప్రస్, కెనడా, క్రొయేషియా, ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాలలో పర్యటించారు. అయితే, ఈ దేశాలకు సంబంధించిన ఖర్చులను మాత్రం మంత్రి వెల్లడించలేదు.

# విజయవాడ, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టులపై మంత్రి నారాయణ కీలక ప్రకటన

మొదటి దశ పనులను మూడేళ్లలో పూర్తి చేస్తామని వెల్లడి

విజయవాడ మెట్రోకు రెండు రోజుల్లో టెండర్లు పిలుస్తామన్న మంత్రి

**ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్, సిస్టా, టిప్సా కన్సల్టెన్సీలతో అవగాహన ఒప్పందం**

విశాఖపట్నం, విజయవాడ మెట్రో మొదటి దశ పనులను మూడేళ్లలో పూర్తి చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఈ రెండు ముఖ్య నగరాల మెట్రో ప్రాజెక్టులకు నిధుల కేటాయింపునకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో ఇందుకు సంబంధించిన ప్రక్రియ వేగవంతమైంది. మెట్రో ప్రాజెక్టు, పర్యవేక్షణ, సాంకేతిక సహకారంపై కన్సల్టెన్సీలతో శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది.మంత్రి సమక్షంలో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్, సిస్టా, టిప్సా కన్సల్టెన్సీల ప్రతినిధులు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, విశాఖ మెట్రో ఫేజ్ 1లో భాగంగా 46.23 కిలోమీటర్లు పనులకు టెండర్లు పిలిచినట్లు చెప్పారు. ఫేజ్-2లో మరో 30 కిలోమీటర్లు ఉంటుందని తెలిపారు. విజయవాడ మెట్రో రైలుకు మరో రెండు రోజుల్లో టెండర్లు పిలుస్తామని వెల్లడించారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహనకలిగి ఉండాలి

**జిల్లా సహకార అధికారి ఎం.వి.రామ కృష్ణ రాజు**




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 25:** సమాచార హక్కు చట్టంపై అవగాహనకలిగి ఉండాలని జిల్లా సహకార అధికారి ఎం.వి. రామ కృష్ణ రాజు అన్నారు.రాష్ట్ర సమాచార కమిషనర్, రాష్ట్ర సహకార సంఘముల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా సహకార శాఖ అధికారులు, సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహనా కార్యక్రమాన్ని జూలై 24, 25 తేదీల్లో నిర్వహించారు. జిల్లా సహకార అధికారి ఎం వి రామ కృష్ణ రాజు ఆధ్వర్యములో కార్యక్రమంలో, సమాచార హక్కు చట్టము 2005 పై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ / సూపరింటెండెంట్స్, పి ఇందిర లావణ్య, పి సుబ్బారావు ఇతర సహకార సిబ్బంది మరియు పాడేరు డివిజన్ పిఎసిఎస్ సంఘ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఐ యాక్ట్ ముఖ్య ఉద్దేశ్యం ఇంకా పిఐఓ, ఎపిఐఓ విధులు గురించి జిల్లా సహకార శాఖ అధికారి వారు వివరించారు.

# దుక్కెరి జ్ఞానేశ్వర్రావును పరామర్శించిన జిల్లా బిజెపి అధ్యక్షురాలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 25:** పాడేరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బిజెపి సీనియర్ నాయకుడు దుక్కెరి జ్ఞానేశ్వర్రావును జిల్లా బిజెపి అధ్యక్షురాలు మఠం శాంతా కుమారి పార్టీ నాయకులతో కలిసి ఆసుపత్రికి వెళ్లి గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గూడెం కొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీ రామ్ నగర్ కాలనీకి చెందిన దుక్కెరి జ్ఞానేశ్వర్ రావ్ 1987వ సంవత్సరం నుండి బిజెపి పార్టీలో ఉన్నారు. ఈయన మండల,రాష్ట్ర,జిల్లా స్థాయిలలో పార్టీ పరంగా కీలక బాధ్యతలు నిర్వహించిన అనుభవాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన కుమారుడు దుక్కెరి ప్రభాకర్ అరకు పార్లమెంట్ కిషన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. తన ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని పరామర్శించడానికి వచ్చిన బిజెపి నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన త్వరగా కోలుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతాకుమారి ఆకాంక్షించారు.

# దామనాపల్లిలో శానిటేషన్ డ్రైవ్ లో పాల్గొన్న ఎంపీడీవో







**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 25:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దామనపల్లి పంచాయతీ కేంద్రంలో గురువారం ఉదయం నిర్వహించిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పాల్గొని పర్యవేక్షించారు.ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం,డ్రైనేజీ క్లీనింగ్,చేతి బోరు నీరు టెస్టింగ్ మరియు ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన పశువులు నీరు తాగే తొట్టెలను పరిశీలించారు.అనంతరం సచివాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సచివాలయం ఉద్యోగులతో సమావేశం అయ్యారు. నేటి నుండి పి4 బంగారు కుటుంబాల సర్వే ప్రారంభించాలని,రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, ఉద్యోగులు సమయపాలన పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుందేరి రామకృష్ణ, పంచాయతీ సెక్రెటరీ రుత్తుల వెంకట శివలక్ష్మి, డిజిటల్ అసిస్టెంట్ బేరా సింహాచలం, విలేజ్ సర్వేయర్ గబులంగి బుజ్జిబాబు,ఇంజినీరింగ్ అసిస్టెంట్ పసుపులేటి లక్ష్మి విమల, మహిళా పోలీసు వంగల రమణమ్మ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కోసూరు ఉషా రాణి,ఎఎన్ఎం పి. పోలమ్మ,వీఆర్వీ కె. వివేకానంద దొర తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల హక్కులకు రక్షణ కల్పించాల్సిన భాద్యత మనందరిది






- **జిల్లా న్యాయం సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.ఎస్.సన్యాసినాయుడు**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 25:**గిరిజనుల హక్కులకు రక్షణ కల్పించాల్సిన భాద్యత మనందరిపై ఉందని జిల్లా న్యాయం సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.ఎస్.సన్యాసి నాయుడు తెలిపారు.శుక్రవారం స్థానిక కాఫీ హౌస్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, గిరిజన ప్రాంత పారా లీగల్ వాలంటీర్లు, ప్యానెల్ అడ్వకేట్లు, గిరిజన యువత ఇతర స్టేట్ హెూల్డర్స్ కు న్యాయ సేవల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.ఎస్.సన్యాసి నాయుడు అధ్యక్షత వహించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్.ఎం.జె.అభిషేక్ గౌడ, జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, దామోదర సంజీవయ్య న్యాయ కళాశాల వైస్ ఛాన్సలర్ సూర్య ప్రకాష్, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ తో కలసి జ్యోతి ప్రజ్వలన గావించారు. చిన్నారుల భక్తి గీతాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జ్ మాట్లాడుతూ గిరిజనుల హక్కులకు రక్షణ కల్పించాల్సిన భాద్యత మనందరిదన్నారు.గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలకు ఒక ప్రత్యేకత ఉందని తెలిపారు. ఈరోజు పలు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరూ తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్.ఎం.జె.అభిషేక్ గౌడ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన సంస్కృతికి ప్రాధాన్యత ఉందన్నారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలకు భద్రత కల్పించే బాధ్యత మనందరిపై ఉందన్నారు.సమన్వయంతో ముందుకు సాగితే సమస్యలను అధిగమించవచ్చని పేర్కొన్నారు. న్యాయ సేవలపై శిక్షణ పొందిన వారు మరింత మందికి అవగాహన కల్పించాలని అన్నారు. ఇటువంటి శిక్షణా తరగతుల ద్వారా ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ పాడేరు ప్రాంతంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గిరిజనుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో జ్యూడిషయల్ సిస్టమ్ ఉందన్నారు. అందరిలో అవగాహన కల్పించడానికే ఈ శిక్షణ అని పేర్కొన్నారు. అతి తక్కువ వ్యయంతో డిఎల్ఎసి ద్వారా న్యాయం పొందవచ్చని సూచించారు. గిరిజన సంస్కృతి చాలా భిన్నమైందని, దానికి రక్షణ కల్పించే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. భారతీయ సంస్కృతిలో గిరిజన సంస్కృతి చాలా కీలకమని, సంఘంలో ఉండే ప్రతీ పౌరుడితో సామరస్యంగా స్నేహభావంతో ఉండాలన్నారు. న్యాయం పొందాలంటే కూర్చొని చర్చించుకుంటే సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని స్పష్టం చేశారు.దామోదర సంజీవయ్య న్యాయ కళాశాల వైస్ ఛాన్సలర్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రక్షణ కల్పించడానికి ఈ శిక్షణా చాలా ఉపయోగపడుతుందని అన్నారు. గిరిజన ప్రజల హక్కుల రక్షణ అవసరమని అన్నారు. సమాజానికి, వ్యక్తికీ ప్రాంతాలను బట్టి భాష ఉంటుందని, అటవీ హక్కులను కాపాడుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో గల గిరిజనులు తమ హక్కులను కాపాడుకునే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. భారతీయ రాజ్యాంగంలో ప్రతీ భారతీయునికి కొన్ని హక్కులు ఉన్నాయని, వాటిని ఎలా పొందాలో వివరించారు. శిక్షణ పొందుతున్న వారు పలువురుకి అవగాహన కల్పించడానికి ఒక వారధిలా పనిచేయాలన్నారు.పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఇటువంటి కార్యక్రమం చేపట్టడం మంచి శుభపరిణామం అన్నారు. శిక్షణా కార్యక్రమంలో అన్ని అంశాలు ప్రతిఒక్కరు తెలుసుకొని తెలియని వారికి తెలియజేయాలన్నారు.మాస్టర్ ట్రైని ఆర్. శ్రీనివాస రావు దామోదర సంజీవయ్య లా కళాశాల వైస్ ఛాన్సలర్ సూర్య ప్రకాష్ శిక్షణ అందించి తదుపరి వారి సందేహాలు నివృత్తి చేసారు.ఈ శిక్షణా తరగతుల్లో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి విశ్వేశ్వరనాయుడు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఝాన్సీ భాయ్, జిల్లా లేబర్ ఆఫీసర్ సుజాత, జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీ రావు, డ్వామా పిడి డా. విద్యాసాగర్, విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, సహాయ సంచాలకులు కె.కవిత, అంగన్వాడీ వర్కర్స్, ఆశా వర్కర్స్, పారా లీగల్ వాలంటీర్లు, పానేల్ అడ్వకేట్స్, గిరిజన యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.





# అంగరంగ వైభవంగా ప్రారంభమైన శ్రీ రాజరాజేశ్వరి చతుర్థి వార్షికోత్సవం.



అమ్మవారిని దర్శించుకున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల.





**పరవాడ: (పెన్ పవర్)జూలై 25:** జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీ లోని రామ్కీ కమర్షియల్ హబ్ వద్ద ఉన్న శ్రీ గణపతి, సుబ్రహ్మణ్యం, శ్రీ చక్ర సహిత రాజరాజేశ్వరి అమ్మవారి చతుర్థి వార్షికోత్సవం విశాఖ ఫార్మాసిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు విశాఖ ఫార్మాసిటీ ఎండి డా "లాల్ కృష్ణ, రామ్ కి ఫౌడేషన్ చైర్మన్ రామి రెడ్డి, విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ రావు బక్షి ఇతర ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఆలయ కమిటీ నిర్వాహకులు డప్పు వాయిద్యాలతో ను, వేద పండితులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేసి సాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం రామ్కీ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మొబైల్ అంబులెన్స్ ను ఎమ్మెల్యే రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. రామ్ కి ఫౌడేషన్ నిధులతో సమకూర్చిన వంట వస్తు సామాగ్రిని ఎమ్మెల్యే అంగన్వాడీలకు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామ్కీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డా "శ్రీకాంత్, మాజీ మండల అధ్యక్షులు పైలా జగన్నాధ రావు, జనసేన పార్టీ పరవాడ ఇన్చార్జి పంచకర్ల ప్రసాద్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బొద్దపు శ్రీను కాసులు, మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా,రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా కార్యదర్శి బుగిడి రామ గోవిందరావు, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కూటమి నాయకులు సర్వసిద్ధి సన్యాసిరాజు, కరణం నర్సింగరావు, మడక రమణ, దుళ్ళ రాము నాయుడు, చలపతి రెడ్డి రామారావు, సాలాపు మోహన్,కోమటి సూరిబాబు, విశాఖ ఫార్మాసిటీ ఉద్యోగులు, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పెదవలస సచివాలయం సిబ్బందికి ఘన సన్మానం





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 25:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం పెదవలస పంచాయతీ సచివాలయంలో ఇటీవల బదిలీ అయిన సిబ్బందికి సర్పంచ్ కృష్ణవంశీ, వైస్ ఎంపీపీ చప్పగడ్డ ఆనంద్ ఆధ్వర్యంలో పంచాయితీ యొక్క వివిధ పార్టీలకు చెందిన నాయకులు ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానం చేశారు. వారు చేసిన సేవలు ప్రజల మదిలో నిలిచిపోయేలా ఉండటంతో, పంచాయతీ తరపున వారికి దుస్సాలు కప్పి సత్కారం చేశారు.ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ పి. కృష్ణవంశీ మాట్లాడుతూ, "మీరు అందించిన సేవలు మాకు మరపురాని జ్ఞాపకాలు. మీరు వెళ్లిన సచివాలయాల్లో కూడా అద్భుత సేవలతో ప్రజలకు ఆదర్శంగా నిలవాలని కోరుకుంటున్నాం. దేవుడు మీకు ఆయురారోగ్యాలు కలగజేయాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాం," అని తెలిపారు. అలాగే సచివాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సచివాలయం సిబ్బందికి కూడా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, ప్రజా ప్రతినిధులు, వార్డు మెంబర్లు, పీసా కమిటీ సభ్యులు, పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షులు త్రిమూర్తులు, పంచాయతీ సెక్రటరీ బాలకృష్ణతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమం సానుకూల వాతావరణంలో సాగింది.

# హుకుంపేట. విజయవంతంగా పి ఫోర్ గ్రామసభ



హుకుంపేట పెన్ పవర్ జూలై 25 హుకుంపేట మండలం హుకుంపేట గ్రామపంచాయతీలో సర్పంచ్ సమీడ వెంకట పూర్ణిమ అధ్యక్షతన పి 4 గ్రామసభ జరిగింది. ఈ కార్యక్రమం లో ఆమె మాట్లాడుతూ పి 4 గ్రామసభ యొక్క ముఖ్య ఉద్దేశం నిరుపేదలైన ప్రజలకి ఆధార్ కార్డు , బ్యాంకు ఖాతా గ్యాస్ కనెక్షన్లు వంటివి చేయించి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను అరుహులు ఐన వారికి అందేలా చేయడమే ఈ పి4 గ్రామసభ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని ఆమె అన్నారు వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ప్రతి ఆశ కార్యకర్త, సి హెచ్ డబ్ల్యు. ప్రతి గడప గడపకు వెళ్లి ప్రజలు ఆరోగ్యం గురించి కచ్చితంగా తెలుసుకోవాల్సింది గా ఆమె వారికి సూచనలు తెలిపారు. అలాగే ప్రతి ఇంటి చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా అవగాహన కల్పించమని ఆమె ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ సువర్ణ, సెక్రెటరీ సత్యనారాయణ, ఎంపీటీసీ రమా, వి ఆర్ ఒ రత్నకుమారి వైస్ సర్పంచ్ గోవింద్, వార్డ్ మెంబర్స్ నాగబాబు,లక్ష్మణ్,అన్నపూర్ణ, పీసా కమిటీ సభ్యులు గణేష్, వెంకట్,రామకృష్ణ, వి ఆర్ పి రామయ్య,అంగన్వాడి కార్యకర్తలు, ఆశాలు, సచివాలయ సిబ్బంది, నాయకులు అనిల్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముల్లు మెట్టలో ద్విచక్ర వాహన ప్రమాదం- ఇద్దరు మృతి







**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జులై 25:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం రింతాడా పంచాయతీ ముల్లుమెట్ట గ్రామంలో గురువారం ఉదయం జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో ఇద్దరికీ యువకులు మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు వస్తూ ఉండగా ముల్లు మెట్ట జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదం జరగటంతో చింతపల్లి మండలం రాసపనుకు గ్రామానికి చెందిన కిల్లో వీర్రాజు(21) సంఘటన స్థలంలోనే మృతి చెందారు. గాయాలు పాలైన మరో ఇద్దరిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గూడెం కొత్త వీధి మండలం వంచుల పంచాయితీ మురగడపల్లి గ్రామానికి చెందిన పాంగి నితిన్(20) మృతి చెందారు. మెరుగైన చికిత్స కోసం గాయాల పాలైన మరో క్షతగాత్రుడు మహేష్ ను విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జూనియర్ ఎన్టీఆర్ వార్-2 ట్రైలర్ సూపర్ హిట్

నాయకులు చింతకాయల రాంబాబు





**పాయకరావుపేట పెన్ పవర్ జులై 26:**బాలీవుడ్ లో జూనియర్ ఎన్టీఆర్ మరియు రుతిక్ రోషన్ అయన్ ముఖర్జీ దర్శకత్వంలో నిర్మాతగా ఆదిత్య చోప్రా భారీ బడ్జెట్ తో నిర్మించిన వార్-2 చిత్రం ఆగస్టు 14వ తేదీన విడుదలకు సిద్ధంగా ఉంది ఈ సందర్భంగా 2.30 సెకండ్లు పాయకరావుపేటలో నందమూరి కల్చర్ యూత్ గౌరవ అధ్యక్షులు చింతకాయల రాంబాబు మరియు ప్రేక్షకుల ఆధ్వర్యంలో ట్రైలర్ విడుదల చేశారు. ఈ మేరకు ట్రైలర్ చూసిన నందమూరి అభిమానులు జై ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేస్తూ ఆనందముగ్ధులయ్యారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ట్రైలర్ రిలీజ్ చేసినా చిత్ర మందిర్ థియేటర్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అలాగే మొట్టమొదటిసారిగా బాలీవుడ్ లో రికార్డులు వార్-2 ద్వారా బద్దలు కొడుతుందని, నందమూరి వంశ బిడ్డగా తాతకు తగ్గ మనవడుగా తండ్రికి, బాబాయికి తగ్గ కొడుకుగా జూనియర్ ఎన్టీఆర్ నటనతో అభిమానులను,ప్రేక్షకులను మరింత ఆనందింప చేస్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి కల్చర్ అధ్యక్షులు విశ్వనాధుని శ్రీను ఆర్గనైజర్ బత్తిని గోవిందు గదులచ్చిబాబు దొంగల శ్రీను శ్రీరంగ వరహాలు నందమూరి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వినూత్నరీతిలో ఆదివాసీల నిరసన.

**3 కిలోమీటర్ల గుర్రాల యాత్ర. హామీలుగానే మిగిలిన డిప్యూటీ సీఎం హామీలు.**

**అనంతగిరి జూలై 29 పెన్ పవర్.**రోడ్డు పనులు మొదలు పెట్టాలని కోరుతూ ఆదివాసీ గిరిజనులు శుక్రవారం నాడు గుర్రాలతో 3 కిలోమీటర్లు పాదయాత్రను వినూత్నంగా నిర్వహించారు,అనంతగిరి మండలం పినకోట,పెదకోట జీనబాడు పంచాయతీ పరిధిలో11 గ్రామాల పివిటీజి కొందు తెగ చెందిన 2500 మంది గిరిజనులు జీవనం సాగిస్తూ ఉన్నారు.12 డిసెంబర్ 24న బలగరువు నుండి వాజంగి

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయాన కిలోమీటర్లు నడిచి వెళ్లారు.గుమ్మంతి నుండి రాజకీలంటూ రెడ్డిపాడు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.బల్లగరువు నుండి వాజంగి, పీచు మామిడి,గుమ్మంతి, కోటల గరువు మీదుగా దాయార్తి వయా మద్రేబు నుండి తునిసీబు గ్రామాలకు జనవరి 25వ తేదీన 12 కిలోమీటర్లకు రూ.11 కోట్ల 64 లక్షల రూపాయలు బిటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. బల్లగరువు నుండి వాజింగ్ వరకు పవన్ కళ్యాణ్ నడిచి వచ్చి రోడ్లకు శంకుస్థాపన చేశారు. కానీ నేటికీ 7 నెలలు గడుస్తున్న రోడ్డు పనులు మాత్రం ప్రారంభించలేదు, 11 గ్రామాల పివిటీజి రేషన్ డిపోకు వెళ్లాలంటే 24 కిలోమీటర్ నుండి 44 కిలోమీటర్ల వరకు నడిచి వెళ్లవలసిన దుస్థితి. 8 ఎంపీపీ పాఠశాలలు,8 అంగన్వాడి



కేంద్రాలు ఉన్నాయి. వీరికి పోషక అహారం తీసుకుని వెళ్లాలన్న గుర్రాల మీద తీసుకెళ్లి పరిస్థితి నెలకొంది.. గత నెల బాబు కూడా కేజీహెచ్ లో చనిపోగా భుజం మీద వేసుకొని మద్రేవు. రాష్ట్ర ప్రభుత్వం డోలీల వ్యధ లేకుండా రోడ్ల నిర్మాణం చేస్తామని కోట్ల రూపాయలు నిధులు విడుదల చేశారు. నేటికీ పనులు ప్రారంభించకపోవడంతో మేము అనేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు, రహదారి నిర్మాణం ఎప్పుడు మొదలు పెడతారు ఎప్పటికీ పూర్తవుతుందో కొద్ది రోజులు వేచి చూడాల్సిందే.వినూత్నరీతిలో ఆదివాసీల నిరసన.

# ఏకలవ్య ఫౌండేషన్ ద్వారా రైతులకు మేలు





- ఏకలవ్య మహిళ రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలకవర్గ సమావేశం ఏర్పాటు.
- సబ్సిడీతో పనిముట్లు ఏకలవ్య ఫౌండేషన్ అందిస్తుంది.
- ఏకలవ్య ఫౌండేషన్ ద్వారా రైతులు ఆర్గానిక్ పంటలు పండించడానికి కృషి చేస్తుంది.
- ఏకలవ్య ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సతీష్, జిల్లా ఇంచార్జ్ ఉమా వెంకటేష్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 25.**ఏకలవ్య ఫౌండేషన్ రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఏకలవ్య ఫౌండేషన్ ద్వారా రైతులకు మేలు జరుగుతుందని ఏకలవ్య ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సతీష్ అన్నారు. అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ఏకలవ్య ఫౌండేషన్ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏకలవ్య మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలకవర్గ సమావేశం జరిగాయి. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏకలవ్య ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సతీష్ మాట్లాడుతూ..మహిళా రైతు ఉత్పతి దారుల సంస్థ అనేది రైతులకు సబ్సిడీతో పనిముట్లు సంస్థ ద్వారా అందిస్తుందని, సేంద్రీయ వ్యవసాయని ప్రోత్సహిస్తుందన్నారు. రైతులు దళారీ వ్యవస్థని నమ్మి మోసపోకూడదని, పండించిన ప్రతి పంటకు వాల్యూ ఎడిషన్ చేసి మార్కెట్ చేయటం వలన రైతులకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సంస్థకు సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ షేర్ సర్టిఫికెట్ అందచేయటం జరుగుతుందనన్నారు. ఏకలవ్య ఫౌండేషన్ యొక్క కార్యక్రమాలు రైతుల జీవితాలను మెరుగుపరచడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ ఉమా వెంకటేష్, ఏకలవ్య మహిళ రైతు ఉత్పత్తిదారుల సంస్థ సీఈఓ సీసా రత్న కుమారి, చైర్మన్ ఎం దేవమణి, వైస్ చైర్మన్ సావిత్రి, అకౌంటెంట్ నాగరాజు, జగన్నాదంపడాల్, జగదంబ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి.

**పంచాయితీ కమిటీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శుల ఎన్నికల సమావేశంలో ఉపాధ్యక్షుడు రేగం చాణక్య.**

**అనంతగిరి జూలై 29 పెన్ పవర్.**అనంతగిరి మండలంలో జరిగిన వైసీపీ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు ఏకగ్రీవ ఎన్నికలు వైసీపీ అనంతగిరి మండల పార్టీ అధ్యక్షుడు కొర్ర సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగం చాణక్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.చాణక్య మాట్లాడుతూపైనంపాడు,వెంగడ,వాలసి గ్రామ పంచాయతీల గ్రామ కమిటీ అధ్యక్షులుగా బొడ్డా జన్ని రాంబాబు,పుట్ట బోయిన శ్రీరామ్,పాటి రవి కుమార్ పాటు ప్రధాన కార్యదర్శులు కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వైసీపీ పార్టీ గ్రామ పంచాయతీ కమిటీ అధ్యక్షులుగా,ప్రధాన కార్యదర్శులుగా కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ బలోపేతానికి కృషి చేయాలని,నూతనంగా ఎన్నికైన సభ్యులను దిశ నిర్దేశం చేశారు.రాబోయే పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శెట్టి నీలవేణి అనంతగిరి మండల అనంతగిరి ప్రజా పరిషత్ అధ్యక్షురాడు,వైసీపీ అరకు నియోజకవర్గం బూత్ కమిటీ ఇంచార్జ్ విజయ్ అప్పారావు అనంతగిరి మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షులు,మాజీ జడ్పీటీసీ సభ్యులు దూరు గంగన్న దొర.లంగుపర్తి సర్పంచ్ జన్ని సన్యాసిరావు,పెద్ద బిడ్డ గ్రామపంచాయతీ సర్పంచ్ సాలె పెంటమ్మ గుమ్మ సర్పంచ్ కురడబోయిన రాములమ్మ వాలసి సర్పంచ్ సెంబి సన్యాసి రావు,పెద్ద బిడ్డ ఎంపీటీసీ జయశ్రీ మాజీ ఎంపిటిసి జన్నీ చంద్రయ్య గుజ్జలి మధుసూదన్ చందు పట్నాయక్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## డుడుమ బస్సు పునరుద్దరణ చేయాలని నిరసన

- డుడుమ బస్సులేక ఆ ప్రాంత ప్రజలు పడుతున్న బాధలు వర్ణానతీతం.
- యధావిధిగా డుడుమ బస్సు నడించాలని డిమాండ్.
- గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను, నాయకులు గాసిరం దొర, నర్సింగరావు పడాల్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 25.**మండలంలో డుడుమ బస్సును పూర్తిస్థాయిలో పునరుద్ధరణ చేయాలని, బస్సులులేక గిరిజనులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని గిరిజన మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను, గిరిజన సంఘం నాయకులు సొలగం గాసిరం దొర, మఠం నరసింగరావు పడాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆ ప్రాంత ప్రజలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం డుడుమ కెళ్ళే బస్సు తొలగించడంతో ఆయా మారుమూల గ్రామాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అటుగా వెళ్లే వాహనాలులేక ప్రజల ఇక్కట్లు వర్ణనతీతమన్నారు. గడచిన రెండు నెలల నుండి ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు ప్రాంతంలో నడుస్తున్న ఏకైక డుడుమ బస్సు పూర్తి స్థాయిలో నడపకపోవడం వల్ల నిత్యం ఆ ప్రాంతంలో పనిచేసే ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, సరిహద్దు ప్రాంత గిరిజనులు తీవ్ర ఇబ్బందులు గురి అవుతున్నారని అన్నారు. కూరగాయల ఉత్పత్తికి ప్రధాన కేంద్రంగా ఉన్న దోడిపుట్టు నుండి జిల్లా వ్యాప్తంగా కూరగాయల సరఫరా డుడుమ బస్సు మీద జరుగుతుండేవని, బస్సు సౌకర్యం లేకపోవడంతో కూరగాయలు పండించే రైతులు సైతం ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లాలో ఉన్న కూటమి నాయకులతోపాటు వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, జెడ్పీ చైర్ పర్సన్ అందరు స్పందించి బస్సు పునరుద్ధరణ చేసి యధావిధిగా నడిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే గిరిజనులందరిని సమీకరించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కొములు, గోపాల్, డోమ్రుబ్బు, డోమ్బుతో పాటు ఆ ప్రాంతాల కూరగాయలు రైతులు పాల్గొన్నారు.

## 87వ వార్డు లో నూతనంగా బదిలీ అయి విధులు నిర్వహిస్తున్న వారితో అవగాహన సదస్సు



**గాజువాక పెన్ పవర్ జూలై 25:**జివియంసి 87వ వార్డు పరిధి వడ్లపూడి సచివాలయం నందు టిడిపి రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం జగన్ ఆధ్వర్యంలో నూతనంగా బదిలీ అయి వార్డులో విధులు నిర్వహిస్తున్న సచివాలయం సిబ్బంది మరియు కార్యకర్తలతో అవగాహన సదస్సు నిర్వహించారు . ఈ సందర్భంగా వార్డు లో ఉన్న సచివాలయం సిబ్బంది వారు కార్యకర్తలకు పరిచయం చేసుకుంటూ ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ ప్రజలు వారి అవసరాలు నిమిత్తం సచివాలయం సిబ్బందిని సంప్రదించినప్పుడు సానుకూలంగా స్పందించి వారి సమస్యను పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు విజయరామరాజు, బిజెపి జిల్లా సెక్రెటరీ లక్కరాజు సోమరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, మాజీ హాస్పిటల్ కమిటీ చైర్మన్ రాజన్ రాజ్, జనసేన సెక్రెటరీ భాస్కర్ రాజు, కె. నర్సింగరావు, ఇందిరా ప్రియదర్శిని,పోతల కృష్ణ, కణితి ఈశ్వరరావు, జాన్ రమేష్, కడుపుట్ల శ్రీను, కిరణ్, సుందర్ సునీల్, వై నాగేశ్వరరావు, రంజిత్, సానిటరీ ఇన్స్పెక్టర్ అప్పారావు, మలేరియా డిపార్ట్మెంట్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ వీర్రాజు, హాస్పిటల్స్ సూపర్ ఇండెంట్ దొరబాబు, గోపి, సచివాలయం సిబ్బంది, సానిటరీ సిబ్బంది, ఆర్పీలు, మహిళలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వార్డుల్లో పెండింగ్లో ఉన్న పనులు సత్వరమే పూర్తి చేయాలని కోరిన : కెజిఆర్



**గాజువాక పెన్ పవర్, జూలై 25:**వార్డులో 2024 నుండి మంజూరైన ఉన్న పనులను పూర్తి చేయించండి గ్రేటర్ విశాఖ మున్సిపల్ కమిషనర్ కి 69 వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి వినతి పత్రం అందజేశారు

గ్రేటర్ విశాఖపట్నం కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 69 వ వార్డులో గత సంవత్సరం 2024 మరియు 2025 కు సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు కానీ ఎక్కడి గొంగళి అక్కడే వేసినట్టు పనులు మాత్రం ముందుకి కదల్లేదని, వార్డులో సీసీ రోడ్లు మరియు డ్రైనేజీలు సామాజిక భవనాలు అంగన్వాడి కేంద్రం పునరుద్ధరణ జరగలేదని దయచేసి జీవీఎంసీ కమిషనర్ ఈ పనులన్నీ త్వరగా చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కు 69 వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి వినతిపత్రం ద్వారా కోరారు
.

## కుల గణన సర్వే.. 88 కోట్ల పేజీలా..!




**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణ పౌరులకు పట్టుమని పది పేజీలుచదివే ఓపిక కూడా లేని ఈ రోజుల్లో ఏకంగా 88 కోట్ల పేజీల సర్వే అంటే.. ఎవరైనా ముట్టుకుంటారా? ఎవరైనా కనీసం.. దానిని ఆమూలాగ్రం పరిశీలించే వీలుంటుం దా? అంటే.. చెప్పడం కష్టం. కానీ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం.. ఔననే అంటున్నారు. తాము ప్రతిష్టాత్మకంగా చేయించిన కుల గణన సర్వే విషయాన్ని తాజాగా ఢిల్లీలో ప్రస్తావించిన ఆయన.. తమ సర్వే రిపోర్టు 88 కోట్ల పేజీల్లో ఉందని చెప్పుకొచ్చారు. దీనిని ఎవరైనా చదువుకోవచ్చుని కూడా సెలవిచ్చారు.వాస్తవానికి రాష్ట్రంలో ఉన్న జనాభానే 4.32 కోట్ల మంది. వారికి సంబందించిన కుల గణన నివేదిక మహా అయితే.. దీనికి డబుల్ వేసుకున్నా.. 10 కోట్ల పేజీల్లో ఉంటుంది. ఉండాలి కూడా. కానీ.. ఏకంగా 88 కోట్ల పేజీల్లో నివేదికలు సిద్ధం చేశామని ఆయన చెబుతున్నారంటే.. ఎవరికి మాత్రం దీనిని చదివే ఓపిక.. పరిశీలించే వెసులుబాటు ఉంటుంది. ఈ విషయాన్ని అటు ఉంచితే.. అసలు ఏ పేజీలో ఏముందో తెలుసుకునే – పీఠిక – ఏకంగా 32 పేజీలపైగానే ఉందని చెప్పుకొచ్చారు.దీనిని చదివేందుకు కూడా ఓపిక ఉండాలి. ఏదైనా సర్వే చేయించినప్పుడు.. అది సాధారణ ప్రజలకు, సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలి. కానీ.. 88 కోట్ల పేజీల్లో ఉంది.. చదువుకోండి.. అంటే.. అది అసాధ్యం. కానీ.. సర్కారు మాత్రం ఇదే చెబుతోంది. దీంతో దీనిపై మేధావి వర్గాలు కూడా పెదవి విరుస్తున్నాయి. దీనిని చదివి అర్థం చేసుకునే సరికే.. పెద్ద సమస్య అని నిత్యం మీడియాలో ఉండే ఓ ప్రొఫెసర్ వ్యాఖ్యానించారు. దీనిని ఉద్దేశ పూర్వకంగా చేశారని అనడం లేదుకానీ.. ఇంత పెద్ద నివేదికను చదివే ఓపిక, ఓర్పు ఎవరికి మాత్రం ఉంటుందన్నదే ప్రశ్న. ఈ సర్వేను ఇతరుల మాట ఎలా ఉన్నా.. కనీసం అధికార పక్షంలో ఉన్న వారైనా చదివారా? అనేది ప్రశ్న. దీనిని చదివి అర్థం చేసుకునే సరికి పుణ్యకాలం గడిచిపోతుందని చెబుతున్నారు. పైగాదీనిని డిజిటల్ రూపంలో తీసుకువస్తున్నట్టు సీఎం చెబుతున్నారు. ఎలా చూసుకున్నా.. ఇది.. కొరకరాని కొయ్యగానే మారుతుంది. ప్రభుత్వం గొప్పగా చెబుతున్నప్పటికీ.. అది సాధారణ ప్రజలకు చేరితేనే.. ప్రభుత్వానికి మేలు జరుగుతుంది. అంతేతప్ప.. 88 కోట్ల పేజీల్లో నివేదిక ఇచ్చామని గొప్పగా చెబుతున్నా.. అది ప్రయోజనం ఇవ్వనప్పుడు వృథానే కదా! అనేది ప్రశ్న.

## పెద్దిరెడ్డి సేవలో గన్ మ్యాన్.. చిత్తూరు ఎస్పీ ఏం చేశారంటే..

**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గన్ మ్యాన్ ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ప్రస్తుతం పుంగనూరు ఎమ్మెల్యేగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభుత్వం భద్రత కల్పిస్తోంది. అయితే సెక్యూరిటీ వ్యవహారాలు చూడాల్సిన గన్ మ్యాన్లు పెద్దిరెడ్డి వ్యక్తిగత సహాయకులుగా వ్యవహరించడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. దీంతో పెద్దిరెడ్డి గన్ మ్యాన్ అయిన ఏఆర్ కానిస్టేబుల్ కాలేషాను సస్పెండ్ చేస్తూ చిత్తూరు ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు రాజంపేట పార్లమెంటు సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి రాజమండ్రి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. కుమారుడిని పరామర్శించేందుకు ఈ నెల 23న పెద్దిరెడ్డి కుటుంబంతో సహా రాజమండ్రి వెళ్లారు. ఆ సమయంలో కోర్టు మిథున్ రెడ్డికి కల్పించిన ప్రత్యేక వసతులు దిండు, దుప్పటి, ఆహార పదార్థాలను తీసుకువెళ్లారు. వీటిని గన్ మ్యాన్ పట్టుకుని జైలులోకి వెళ్లిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి భద్రత చూడాల్సిన ఉద్యోగి వ్యక్తిగత సహాయకుడిగా మారడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. గన్ మ్యాన్ కాలేషా సస్పెన్షన్ కు ఆదేశాలిచ్చింది.చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన కాలేషా పెద్దిరెడ్డి గన్ మ్యాన్ గా చాలా కాలంగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఆయన సర్వీసు నిబంధనలు అతిక్రమించారని ప్రభుత్వం భావిస్తూ సస్పెండ్ చేయడంపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. పెద్దిరెడ్డిపై అక్కసుతోనే గన్ మ్యాన్ ను సస్పెండ్ చేశారని ఆరోపిస్తున్నారు. కాగా, గతంలో ఎంపీ మిథున్ రెడ్డి ఇంటిపై దాడి జరిగిన సమయంలో ఆయన గన్ మ్యాన్ ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఎంపీ మిథున్ రెడ్డి పుంగనూరు వెళ్లేందుకు ప్రయత్నంచగా, ఆయనను అడ్డుకునేందుకు టీడీపీ కార్యకర్తలు పుంగనూరులో పెద్దిరెడ్డి ఇంటిని చుట్టుముట్టారు. ఆ సమయంలో మిథున్ రెడ్డి గన్ మ్యాన్ గాలుల్లో కాల్పులు జరపడంతో ఆయనను సస్పెండ్ చేశారు. దీంతో పెద్దిరెడ్డిపై కక్షతో గన్ మ్యాన్లను ఇబ్బంది పెడుతున్నారని వైసీపీ విమర్శిస్తోంది.

## కుండపోత వర్షం...వాతావరణ శాఖ హైఅలెర్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో మరికొన్ని గంటల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. హైదరాబాద్ వాసులకు కూడా భారీ వర్ష సూచన చేసింది. ఈ మేరకు కొన్ని జిల్లాలకు హైదరాబాద్ వాతవరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణాలోని కొన్ని జిల్లాలకు భారీ వర్షం పడుతుందని తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో కుండపోత వర్షం కురుస్తుందని, సాఫ్ట్ వేర్ కంపెనీల ఉద్యోగులు ముందుగానే కార్యాలయాల నుంచి బయలుదేరి ఇళ్లకు చేరుకుంటే మంచిదని పోలీసు అధికారులు చెబుతున్నారు.

హైదరాబాద్ లో గత నాలుగు రోజుల నుంచి సాయత్రం వేళకు భారీ వర్షం కురుస్తుంది. రహదారులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. అనేక చోట్ల రోడ్లపై నీరు నిలిచి పోవడంతో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఎక్కడి వాహనాలు అక్కడే గంటల కొద్దీ ట్రాఫిక్ లో నిలిచిపోతున్నాయి. మాదాపూర్ లో సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరిన ఉద్యోగులు రాత్రి తొమ్మిది గంటలకు కూడా ఇళ్లకు చేరుకోలేని పరిస్థితి నెలకొంది. రెండు రోజుల క్రితం ప్యారడైజ్ కాలనీ, పైగా కాలనీల్లో వరద నీరు ఇంట్లోకి చేరుకోవడతో వస్తువులన్నీ నీటిలో తడిసి పోయాయి. దీంతో అనేక మంది ఇబ్బందులు పడ్డారు. నాలాలు పొంగి ప్రవహిస్తుండటంతో వరద నీటితో కలిసి మురుగు నీరు కూడా ఇళ్లలో చేరి దుర్గంధం నెలకొంది.

**ఇళ్ల నుంచి బయటకు రావద్దని...**

దీంతో దోమల బెడద కూడా హైదరాబాద్ లో తీవ్రమయింది. ఈ పరిస్థితులతో హైదరాబాద్ నగరంలో డెంగ్యూ వ్యాధి కూడా ప్రబలుతుంది. అనేకమంది డెంగూ వ్యాధితో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. దీంతో పాటు వైరల్ ఫీవర్స్ తో పాటు జలుబు, దగ్గు వంటి లక్షణాలతో ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో ఇన్ పేషెంట్లుగా చేరుతున్నారు. గత నాలుగు రోజుల నుంచి వర్షం వీడకపోతే హైదరాబాద్ నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి ఆకాశం కారు మబ్బులు కమ్ముకుని కారు చీకట్లు అలుముకుంటున్నాయి. చలి వాతావారణం నెలకొని ఉంది. వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

## చంద్రబాబు ప్రయత్నంలో లోపం లేదు.. సహకరించాలిగా?




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భారీ ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడే నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. ప్రధానినరేంద్రమోదీ రీ లాంచ్ చేసిన తర్వాత అమరావతి పనులు వేగం అందుకున్నాయి. ఇక ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దేందుకు చంద్రబాబు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. శాశ్వత భవనాల నిర్మాణాన్ని మొదటిదశ పనులను మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇక ఈ లోపు అమరావతికి అవసరమైన సొబగులు అద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధాని ఉండేందుకు చంద్రబాబు డ్రీమ్ ప్రాజెక్టుకు వేగంగా అడుగులు పడుతున్నాయి.

**అన్నీ హంగులతో...**

అందులో భాగంగా అమరావతిలో అంతర్జాతీయ ఎయిర్ పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రస్తుతం విజయవాడకు గన్నవరం ఎయిర్ పోర్టు ఉన్నప్పటికీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను నిర్మించాలని కూడా డిసైడ్ అయ్యారు. ఇందుకోసం మరో నలభై వేల ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. రైతులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుంది. రైతులు కూడా తమ భూములను ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. అదే జరిగితే మొత్తం డెబ్బయి వేలఎకరాల్లో రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతుంది.

**చుట్టు పక్కల ఉన్న నగరాలను కాదని...**

ఇక కేంద్ర ప్రభుత్వ సంస్థలను కూడా అమరావతిలో నెలకొల్పేందుకు ఢిల్లీ పెద్దలతో నిరంతరం టచ్ లో ఉన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు ముందుకు వస్తే అదనపు ఆకర్షణగా నిలుస్తాయి. ఇక సాఫ్ట్ వేర్ కంపెనీలను కూడా అమరావతికి తీసుకు వచ్చేందుకు చంద్రబాబు తరచూ జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో సమావేశమవుతున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. చేయాల్సిన ప్రయత్నాలన్నింటినీ చంద్రబాబు చేస్తూనే ఉన్నారు. పెట్టుబడుల కోసం రేపు సింగపూర్ కు బయలుదేరి వెళుతున్నారు.

అయితే చుట్టుపక్కల ఉన్న హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలను కాదని అమరావతికి రావాలంటే బిగ్ టాస్క్ అని చెప్పాలి. మరి చంద్రబాబు అటువంటి సమస్య నుంచి అమరావతిని ఎలా ముందుకు తీసుకెళతారన్నది ఆసక్తికరంగా మారింది

## స్విగ్గీ డ్రెస్ లో వచ్చి.. ఐదు నిమిషాల్లో దోపిడీ.. మామూలోళ్లు కాదుగా




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తర్ ప్రదేశ్ లో దోపిడీ దొంగలు స్వైర విహారం చేశారు. రెచ్చిపోయారు. ఘజియాబాద్ లో జరిగిన ఈ ఘటన సంచలనం రేపింది. ఫుడ్ డెలవరీ ఏజెంట్ల ముసుగులో వచ్చిన కొందరు నగల షాపులోకి చొరబడి దోచుకుని వెళ్లారు. లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. జ్యుయలరీ దుకాణం యజమానులను బెదిరించి మరీ దోచుకెళ్లిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. కేవలం ఇద్దరు వ్యక్తులే ఇంతటి దోపిడీకి పాల్పడటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

**ఘజియాబాద్ లో...**

ఘజియాబాద్ లో పట్టపగలే జరిగిన ఈఘటనతో నగల దుకాణాల వ్యాపారులు ఆందోళనకు దిగారు. దుకాణాలను మూసి వేసి తమ నిరసనను తెలియజేస్తున్నారు. ఇద్దరు యువకులు బ్లింకిట్, స్విగ్గీ డ్రెస్ లను ధరించడంతో పాటు హెల్మెట్లతో జ్యుయలరీ దుకాణంలోకి వచ్చారు. వారని అడ్డుకునేందుకు ప్రయత్నించిన దుకాణ సిబ్బందిని నెట్టివేశారు. నిన్న మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. దుకాణంలో ఉన్న ఆభరణాలను తము తెచ్చుకున్న సంచుల్లో వేసుకుని వెళ్లిపోయారు.

**హెల్మెట్లు ధరించి...**

ద్విచక్రవాహనం పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఈ దోపిడీకి పాల్పడ్డారు. సీసీ టీవీ కెమెరాల్లో మొహాలు కనిపించకుండా హెల్మెట్లు ధరించి జాగ్రత్తలు తీసుకున్నారు. కేవలం ఐదు నిమిషాల్లోనే దోపిడీ చేసుకుని పారిపోయారు. ఈ దోపిడీలో 125 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇరవై కిలోల వెండి దోపిడీ దొంగలు తీసుకెళ్లినట్లు దుకాణ యజమాని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే తెలిసిన వారు ఈ పనికి పాల్పడ్డారా? గతంలో పనిచేసిన వారితో పాటు ప్రస్తుతం దుకాణంలో పనిచేస్తున్న వారిపై కూడా అనుమానాన్ని పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. దోపిడీకి గురైన ఆభరణాల విలువ 30 లక్షల వరకూ ఉంటుందని చెబుతున్నారు. దొంగల కోసం పోలీసులు విస్తృతంగా టీమ్ లుగా విడిపోయి గాలిస్తున్నారు.

## తల్లికి వందనం పథకం నగదు పడకపోవడానికి అదే కారణమట




**హైదరాబాద్ పెన్ పవర్:** తల్లికి వందనం పథకం అనేక మందికి అందలేదు. అనేక కారణాలతో పథకం వారికి అందకపోవడంతో గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తల్లికి వందనం పథకం కింద ఏడాదికి పదమూడు వేల రూపాయలు ఒక్కొక్క విద్యార్థికి ప్రభుత్వం ఇస్తున్న నేపథ్యంలో అన్ని అర్హతలున్నా తమకు పథకం నగదుఅందలేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సాంకేతిక కారణాలను చూపి వారికి నగదు జమ చేయలేదు. దీంతో రాష్ట్ర వ్యాప్తగా తల్లికి వందనం కోసం తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. తల్లుల ఖాతాల్లోకి తల్లికి వందనం నగదు ఇంకా జమకాక పోవడంతో తల్లిదండ్రులు రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో ఆందోళన చెందుతున్నారు.

**సచివాలయం సిబ్బందికి...**

గ్రామ సచివాలయం సిబ్బందికి వెళ్లి ఫిర్యాదు చేసినా తాము ఫిర్యాదును రెయిజ్ చేశామని, కొద్దిరోజులు ఓపిక పట్టాలని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు.అయినా సరే తల్లికి వందనం పథకం నగదు జమ కావడంతో ఆలస్యం అవుతుండటంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన సూపర్ సిక్స్ లో ఒకటైన తల్లికి వందనం పథకం ఇంకా కొంతమంది తల్లుల ఖాతాలోకి జమ కాక పోవడాన్ని ప్రశ్నిస్తున్నారు.సచివాలయం దగ్గరికి వెళ్లి తల్లికి వందనం నగదు మాకు జమ కాలేదని అడిగితే కొంతమందికి విద్యుత్తు బిల్లు మూడు వందల యూనిట్లు దాటడం అని చూపిస్తుందని చెబుతున్నారు.

**విద్యుత్తు అధికారుల వద్దకు...**

అయితే అత్యధికంగా వచ్చిన విద్యుత్తు బిల్లులకు సంబంధించి విద్యుత్తు శాఖ అధికారుల వద్దకు వెళ్లి అడిగితే వారు మాత్రం అక్కడ అప్ డేట్ అయిందని చెబుతున్నారు. తల్లిదండ్రులు కరెంట్ ఆఫీస్ లో క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకుని మరలా సచివాలయం దగ్గరికి వచ్చి సమర్పించినా కానీ నగదు జమ కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సచివాలయంలో ఇంకా నగదు ఎందుకు జమ కాలేదని అడిగితే తాము గ్రీవెన్స్ పెట్టామని, అది అలాగే ఉందని చెబుతున్నారు. విద్యుత్తు శాఖ సిబ్బంది దీనికి సంబంధించిన డేటా ప్రభుత్వానికి ఇంకా అందించారో లేదు తెలియదంటున్నారు. గ్రీవెన్స్ లో మాత్రం కంప్లైంట్ అలాగే ఉండటంతో నగదు జమ కావడం లేదు. దీనిపై ప్రజాప్రతినిధులతో పాటు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఇంటికి వస్తున్న ఎమ్మెల్యేలను నిలదీస్తున్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిందే.. అతి భారీ వర్షాలతో ప్రభుత్వాలు అలెర్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్, మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తాయని చెప్పింది. బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. గంటకు అరవై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని కూడా తెలిపింది. రానున్న రెండు రోజుల పాటు సముద్రంలో చేపల వేటకు వెళ్ల రాదని కూడా వాతావరణ శాఖ హెచ్చరించింది. సముద్రంలో భారీ అలలు ఉంటాయని తెలిపింది. అందుకే చేపల వేటను నిషేధించాలని పేర్కొంది.

**తెలంగాణలో ఈ నెల 29వ తేదీ వరకూ...**

తెలంగాణలో ఈ నెల 29వ తేదీ వరకూ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు కామారెడ్డి, మెదక్, జనగాం, హన్మకొండ, వరంగల్, ఖమ్మం, కొత్త గూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షంతో పాటు బలమైన ఈదురుగాలులు కురుస్తాయని తెలిపింది. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

**ఏపీలోనూ మూడు రోజులు...**

ఇక ఆంధ్రప్రదేశ్ లోనూ మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశముందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర కోస్తాలో ఈరోజు మోస్తరు నుంచి భారీ వర్షాలతో పాటు కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు పడే అవకాశముందని పేర్కొంది. దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని తెలిపింది. రాయలసీమలోనూ మోస్తరు వర్షాలతో పాటు బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అవసరమైతే జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయాలని కూడా ఆదేశాలు జారీ చేశారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్!

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ రెండో పౌరుడు ఉపరాష్ట్రపతి. రాజ్యాంగబద్ధమైన ఈ పదవిని ఎలక్టోరల్ కాలేజీ ద్వారా భర్తీ చేస్తారు. దీనికి సంబంధించి శుక్రవారం.. కేంద్ర ఎన్నికల సంఘం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఎన్నికల కు సంబంధించి రిటర్నింగ్ అధికారిగా.. రాజ్యసభ సెక్రటరీ జనరల్ ను నియమించినట్లు పేర్కొంది. అదేవిధంగా రాజ్యసభ సచివాలయానికి చెందిన జాయింట్ సెక్రటరీ గరిమా జైన్, డైరెక్టర్ విజయకుమా ర్‌లను కూడా.. ఎన్నికల పర్యవేక్షకులు, సహాయ రిటర్నింగ్ అధికారులుగా నియమించింది.

రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సూచనల మేరకు.. కేంద్ర న్యాయ శాఖతో చర్చించిన తర్వాత.. ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం.. రాజ్యసభ చైర్మన్, దేశ ఉపరాష్ట్రపతి ఎన్నికలు నిర్వహించే అధికారం కేంద్ర ఎన్నికల సంఘానికి దఖలు పడింది. ఈ నేపథ్యంలో నోటిఫికేషన్ జారీ చేసినట్టు సంఘం తెలిపింది.

**ఎలా నిర్వహిస్తారు?**

ఉపరాష్ట్రపతి ఎన్నికలు రహస్య బ్యాలెట్ ద్వారా నిర్వహిస్తారు. దామాషా ప్రాతినిధ్య వ్యవస్థను అనుసరిస్తుంది. ఎలక్టోరల్ కాలేజీలో పార్లమెంటు సభ్యులు మాత్రమే ఉంటారు. ఎన్నికైన, నామినేటెడ్ లోక్‌సభ సభ్యులు(543 మంది ఎన్నికైనవారు, ఇద్దరు నామినేట్ చేయబడినవారు), రాజ్యసభ సభ్యులు (233 మంది ఎన్నికైనవారు, 12 మంది నామినేట్ చేయబడినవారు), మొత్తం 790 మంది ఓటర్లుగా వ్యవహరిస్తారు. వీరు ఉపరాష్ట్రపతి బ్యాలెట్ విధానంలో ఎన్నుకుంటారు.




నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు నిర్దేశించిన ఫారం 3 లో దాఖలు చేయాలి. ప్రతి నామినేషన్‌కు కనీసం 20 మంది ప్రతిపాదకులు, 20 మంది మద్దతుదారులు సంతకాలు చేయాలి. వీరందరూ ఎంపీలు అయి ఉండాలి. ఒక అభ్యర్థికి ఒకే ఎంపీ ఒకటి కంటే ఎక్కువసార్లు మద్దతు ఇవ్వకూడదు. 15,000 సెక్యూరిటీ డిపాజిట్ నామినేషన్‌తో పాటు నగదు రూపంలో లేదా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ముందస్తుగా డిపాజిట్ చేయాలి. అభ్యర్థులు నాలుగు నామినేషన్ పత్రాల వరకు సమర్పించవచ్చు.

# చేతివేళ్లే మౌస్.. మెటా సంచలనం.. విప్లవాత్మక టెక్నాలజీ

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచం టెక్నాలజీ వేగంతో దూసుకుపోతోంది. ఈ క్రమంలో సామాజిక మాధ్యమ దిగ్గజం మెటా (%వీమ్ఖ%) మరో వినూత్న ఆవిష్కరణతో ముందుకు వచ్చింది. మానవ శరీరం నుండి వెలువడే విద్యుత్ సంకేతాలను ఆధారంగా చేసుకుని, కేవలం చేతి వేలు కదలికలతో కంప్యూటర్లను నియంత్రించే స్మార్ట్ రిస్ట్ బ్యాండ్‌ను మెటా అభివృద్ధి చేసింది. దీనితో ఇక కీబోర్డు, మౌస్, టచ్ స్క్రీన్, వాయిస్ కమాండ్ల అవసరం లేకుండానే కంప్యూటర్‌ను నియంత్రించే రోజులు రానున్నాయి.

**ఏంటీ ఈ స్మార్ట్ రిస్ట్ బ్యాండ్?**

మెటా యొక్క 'రియాలిటీ ల్యాబ్స్' విభాగంలో రూపొందించిన ఈ బ్రేస్‌లెట్, వినియోగదారుడి మణికట్టు వద్ద ఉన్న కండరాల నుండి వెలువడే ఎలక్ట్రోమయోగ్రాఫిక్ (%జువీ+%) సంకేతాలను గుర్తించి పనిచేస్తుంది. మన మెదడు ఇచ్చే ఆదేశాలతో చేతులు కదిలినప్పుడు వచ్చే అత్యంత సూక్ష్మమైన విద్యుత్ సంకేతాలను ఈ పరికరం గ్రహించి, వాటిని కంప్యూటర్‌కు అర్థమయ్యే ఇన్‌పుట్‌లుగా మారుస్తుంది.

**ఎలా పనిచేస్తుంది?**

ఈ స్మార్ట్ రిస్ట్ బ్యాండ్ స్పర్శేతర పద్ధతిలో పనిచేస్తుంది. దీని ప్రత్యేకతలు.. వాడేవారి వేలు కదలికల ఆధారంగా టైపింగ్, ఇతర ఆపరేషన్లు జరుగుతాయి. మనం టేబుల్‌పై రాస్తున్నట్లుగా చేతులు కదిలిస్తే.. ఆ విషయం నేరుగా స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతుంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మనం జేబులో చేతులు పెట్టుకుని కూడా ఈ పరికరాన్ని ఉపయోగించవచ్చు. ఇది దీనికి ఉన్న అత్యంత వినూత్నమైన ఫీచర్.

**దివ్యాంగులకు వరం!**

ఈ టెక్నాలజీ ముఖ్యంగా దివ్యాంగులు, వాయిస్ కమాండ్‌లు ఉపయోగించలేని వారు, లేదా కీబోర్డు వాడలేని వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. శరీరంలోకి ఎలాంటి ఇంప్లాంట్లు అమర్చాల్సిన అవసరం లేకుండానే, ఈ బ్రేస్‌లెట్ వాడటం ద్వారా సులభంగా కంప్యూటర్‌ను నియంత్రించవచ్చు.



ఇది వారి దైనందిన జీవితాన్ని మరింత సులభతరం చేస్తుంది.

**ఎస్‌ఈఎమ్‌జీ టెక్నాలజీతో సుసంపన్నం**

ఈ పరికరం సర్ఫేస్ ఎలక్ట్రోమయోగ్రఫీ (%ంజువీ+%) టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తుంది. అంటే, శరీరం లోపల ఉండే సంకేతాలను బయట నుంచే అత్యంత కచ్చితత్వంతో గుర్తించగల సామర్థ్యం దీనికి ఉంది. చాలా సున్నితమైన విద్యుత్ సంకేతాలను కూడా ఇది రీడ్ చేసి, వాటిని డిజిటల్ యాక్షన్లుగా మార్చగలదు.

**వాడకాలు:**

ఈ స్మార్ట్ రిస్ట్ బ్యాండ్ యొక్క భవిష్యత్ వాడకాలు విస్తృతంగా ఉండనున్నాయి. మెసేజ్‌లు టైప్ చేయడం.. డెస్క్‌ప్లే మెనూలను నియంత్రించడం.. చేతుల కదలికలతో డిజిటల్ కంటెంట్‌ను యాక్సెస్ చేయడం.. రహస్యంగా సమాచారాన్ని పంపించడం.. ఇది గోప్యతను కోరుకునే వారికి ఎంతో ప్రయోజనకరం.

**భవిష్యత్తు దిశగా మెటా అడుగులు**

ఈ టెక్నాలజీ ఇప్పటికీ అభివృద్ధి దశలో ఉంది. మెటా సంస్థ ఈ రంగంలో మరిన్ని పరిశోధనలకు మద్దతు ఇస్తోంది. డేటా మోడళ్లు, సాఫ్ట్‌వేర్ డిజైన్లు, పరికరాల రూపకల్పనల్లో ఇతర పరిశోధకులకూ సహకరించనుంది. దీని ద్వారా మరిన్ని కొత్త టెక్నాలజీలు వస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

ఈ టెక్నాలజీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చినప్పుడు.. కంప్యూటర్ వాడకంలో గొప్ప విప్లవం సంభవించనుంది. ఇది కేవలం టెక్నాలజీ అభివృద్ధి మాత్రమే కాదు.. మనం ఎలా జీవిస్తున్నామో, ఎలా పని చేస్తున్నామో మార్చివేసే దిశగా ఒక కీలకమైన అడుగు.

# అసలేంటి ధర్మస్థల హత్యల వివాదం?



**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటకలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం ధర్మస్థల, ఇప్పుడు సంచలనాత్మక ఆరోపణలతో వార్తల్లో నిలిచింది. ఒక మాజీ పారిశుధ్య కార్మికుడు చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ ఆరోపణల తీవ్రత, పోలీసుల స్పందన, సిట్ ఏర్పాటు, గతంలో జరిగిన ఘటనలు.. ఈ అంశాలన్నీ వివాదానికి మరింత ఆజ్యం పోశాయి. ధర్మస్థల ఆలయంలో గతంలో పనిచేసిన ఓ పారిశుధ్య కార్మికుడు, ఆలయ అధికారుల ఒత్తిడితో దాదాపు 100కి పైగా మృతదేహాలను రహస్యంగా ఖననం చేశానని ఆరోపించాడు. వాటిలో లైంగిక దాడులకు గురైన మహిళలు, మైనర్లు ఉన్నారని, అలాగే 400 మందికి పైగా యువతులు అదృశ్యమయ్యారని పేర్కొన్నాడు. ఈ దారుణాలకు ప్రభావవంతమైన స్థానిక నేతలు, ఆలయ యాజమాన్యం బాధ్యులని అభిప్రాయపడ్డాడు. ఈ ఆరోపణలు శ్రీ వీరేంద్ర హెగ్గడే వంటి కీలక వ్యక్తులపైనా ప్రభావం చూపాయి. అయితే, ఇప్పటివరకు భౌతిక ఆధారాలు లేకపోవడం విచారణను సంక్లిష్టం చేస్తోంది.

**పోలీసుల స్పందనపై విమర్శలు**

పారిశుధ్య కార్మికుడు జూలై 4న ఫిర్యాదు చేసినా, పోలీసులు జూలై 11 వరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. తవ్వకాలకు సిద్ధంగా ఉన్నానని కార్మికుడు చెప్పినప్పటికీ, పోలీసులు అతడిని గుర్తించలేకపోవడం ఆలస్యానికి కారణమైంది. ఇది స్థానిక రాజకీయ ఒత్తిడులు, ఆలయ యాజమాన్యపు ప్రభావం లేదా అధికారుల నిర్లక్ష్యమా అనే అనుమానాలకు దారితీసింది.

**సిట్ ఏర్పాటు.. పురోగతి లేకపోవడమే సమస్య**

ఈ వివాదంపై కర్ణాటక ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్ అధికారి ప్రణవ్ మోహంతి నేతృత్వంలో సిట్ ను ఏర్పాటు చేసింది. అయితే, దర్యాప్తులో ఎటువంటి గణనీయమైన పురోగతి కనిపించకపోవడం ప్రజల్లో విశ్వాసం కోల్పోవడానికి దారితీస్తోంది. పైగా, సిట్ అధికారికి వ్యతిరేకంగా కొందరు న్యాయవాదులు అభ్యంతరాలు వ్యక్తం చేయడం మరింత అనుమానాలకు తావిచ్చింది.

**గతం వెనుక మరొక బాధితురాలి కథ**

ఈ వివాదానికి కొత్త ఊపునిస్తూ 22 ఏళ్ల క్రితం అదృశ్యమైన 'సౌజన్య' అనే యువతి కేసు మళ్లీ తెరపైకి వచ్చింది. ఆమె తల్లి ఇటీవల మీడియాతో మాట్లాడుతూ తన కుమార్తె అదృశ్యంపై పూర్తిస్థాయి దర్యాప్తు కావాలని కోరింది. ఇప్పుడు వెలుగులోకి వస్తున్న ఆరోపణలు తమ కుటుంబం అనుభవించిన బాధను గుర్తు చేస్తున్నాయని ఆమె పేర్కొనడం, పారిశుధ్య కార్మికుడి ఆరోపణలకు బలాన్ని చేకూర్చింది.

**ప్రజలు కోరేది.. పారదర్శక దర్యాప్తు మాత్రమే**

ఇలాంటి నాజూకు అంశాల్లో మతపరమైన ఆస్తిక భావాలు, స్థానిక రాజకీయ ఒత్తిడులు అడ్డుకుంటే నిజం వెలుగు చూడదు. కాబట్టి తక్షణమే తవ్వకాలు ప్రారంభించాలి. సాక్షులకు రక్షణ కల్పించాలి. సిట్ విచారణను వేగవంతం చేయాలి. పారదర్శక నివేదికలు ప్రజలకు అందించాలి. అధికారుల పాత్రపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది. ధర్మస్థల కేసు, దేశంలోని మతస్థలాల పట్ల ఉన్న గౌరవాన్ని సవాల్ చేస్తూ, న్యాయ వ్యవస్థ పారదర్శకతను పరీక్షించే అంశంగా మారింది. ఆధ్యాత్మికత కప్పిపుచ్చిన చీకటి నిజాలు వెలుగులోకి రావాలంటే, ప్రభుత్వం ధైర్యంగా ముందుకు రావాలి. లేదంటే, ఇది కేవలం మరో మూతపడ్డ కేసుగానే మిగిలిపోతుంది.

# ఉపరాష్ట్ర ఎన్నిక.. చంద్రబాబు కీ రోల్ ఇదే.. !



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో ఉపరాష్ట్రపతి ఎన్నిక వ్యవహారం తెర మీదకు వచ్చింది. జగదీప్ ధన్‌ఖడ్‌ఆ పదవికి రాజీనామా చేయడంతో ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అయింది. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమైంది. వాస్తవానికి ఉపరాష్ట్రపతి పదవికి ఎవరైనా రాజీనామా చేసినా.. లేదా పదవీ విరమణ జరగడానికి ముందు 60 రోజుల సమయంలో కొత్త రాష్ట్రపతిని ఎన్నుకోవడం అనేది సంప్రదాయం. ఇప్పుడు అనూహ్యంగా జగదీప్ రాజీనామా చేయడంతో 60 రోజులు పాటు కొత్త ఉపరాష్ట్రపతిని ఎన్నుకునేందుకు సమయం ఉంటుంది.

కానీ ఈ దఫా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేవలం 30 రోజుల్లోనే కొత్త ఉపరాష్ట్రపతిని ఎన్నుకోవాలి అన్న ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తుంది. అయితే కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి మద్దతుగా ఉన్న చంద్రబాబు ఈ విషయంలో ఎలాంటి పాత్ర పోషిస్తారు.. ఏ విధంగా ముందుకు వెళ్తారు.. అనేది జాతీయ మీడియాలో చర్చకు దారితీసింది. ఎందుకంటే గత ఎన్నికల్లో మంత్రివర్గ ఎంపిక సమయంలోను, కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులోనూ చంద్రబాబును పక్కన కూర్చోబెట్టుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎందుకంటే టీడీపీ మద్దతు మోడీ ప్రభుత్వానికి అత్యంత కీలకం. వచ్చే ఎన్నికలకు ఎలా ఉన్నా.. గత ఎన్నికల్లో బిజెపి 240 స్థానాలకే పరిమితం కావడంతో ఏపీలోని టిడిపి, బీహార్ లోని జెడియు పార్టీలు మోడీకి మద్దతుగా నిలిచాయి. ఈ క్రమంలోనే ఆయన ఈ రెండు పార్టీలకు ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. ఇప్పుడు అత్యంత కీలకమైన ఉపరాష్ట్రపతి ఎన్నికల సమయంలో కూడా చంద్రబాబుకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఆయన అభిప్రాయాలు ఆయన సూచనలను కూడా పరిగణలోకి తీసుకోవాలి. ఒకవేళ చంద్రబాబు తనకు నచ్చిన వారి పేరును సూచించినా.. కేంద్రం ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని దాని ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుంది. అయితే, ఇప్పటివరకు కేంద్రం నుంచి చంద్రబాబుకు ఈ తరహా సూచనలు కాని ఈ తరహా సలహాలు ఇవ్వమని ఎటువంటి సంకేతాలు పంపించకపోవడం... అదేవిధంగా తనంతట తామే ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసుకోవటం వంటివి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ విషయాన్ని చంద్రబాబు లైట్ తీసుకున్నా.. ఏపీలోని ప్రత్యర్థి పక్షాల నుంచి మాత్రం ఆయనకు విమర్శలు తప్పేలా లేవు. కేంద్రంలో కూటమి ప్రభుత్వాన్ని నిలబెట్టిన చంద్రబాబును కనీసం సంప్రదించకుండానే ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేశారు.. అన్న వాదన చంద్రబాబు మెడకు చుట్టుకుంటుంది. పైగా ఉపరాష్ట్రపతి పదవి కావడం.. అందులో టిడిపి ఎంపీలు కూడా ఓటు వేయాల్సి రావడంతో మరింతగా చంద్రబాబుకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుంది.

దీనిని బట్టి బిజెపి విషయంలోను, ఉపరాష్ట్రపతి ఎంపిక, ఎన్నిక విషయంలోనూ చంద్రబాబు వ్యూహాత్మకం గా వ్యవహరించి తన ప్రాధాన్యాన్ని కూడా చెప్పుకునేలాగా తన సూచనలు చేసేలాగా వ్యవహరించాల్సి ఉంటుంది. లేకపోతే విమర్శలు రావడం ఖాయమని పరిశీలకులు భావిస్తున్నారు.

# పెద్దిరెడ్డి సేవలో గన్ మ్యాన్.. చిత్తూరు ఎస్పీ ఏం చేశారంటే..



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గన్ మ్యాన్ ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ప్రస్తుతం పుంగనూరు ఎమ్మెల్యేగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభుత్వం భద్రత కల్పిస్తోంది. అయితే సెక్యూరిటీ వ్యవహారాలు చూడాల్సిన గన్ మ్యాన్లు పెద్దిరెడ్డి వ్యక్తిగత సహాయకులుగా వ్యవహరించడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. దీంతో పెద్దిరెడ్డి గన్ మ్యాన్ అయిన ఏఆర్ కానిస్టేబుల్ కాలేషాను సస్పెండ్ చేస్తూ చిత్తూరు ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు రాజంపేట పార్లమెంటు సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి రాజమండ్రి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. కుమారుడిని పరామర్శించేందుకు ఈ నెల 23న పెద్దిరెడ్డి కుటుంబంతో సహా రాజమండ్రి వెళ్లారు. ఆ సమయంలో కోర్టు మిథున్ రెడ్డికి కల్పించిన ప్రత్యేక వసతులు దిండు, దుప్పటి, ఆహార పదార్థాలను తీసుకువెళ్లారు. వీటిని గన్ మ్యాన్ పట్టుకుని జైలులోకి వెళ్లిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి భద్రత చూడాల్సిన ఉద్యోగి వ్యక్తిగత సహాయకుడిగా మారడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. గన్ మ్యాన్ కాలేషా సస్పెన్షన్ కు ఆదేశాలిచ్చింది. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన కాలేషా పెద్దిరెడ్డి గన్ మ్యాన్ గా చాలా కాలంగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఆయన సర్వీసు నిబంధనలు అతిక్రమించారని ప్రభుత్వం భావిస్తూ సస్పెండ్ చేయడంపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. పెద్దిరెడ్డిపై అక్కసుతోనే గన్ మ్యాన్ ను సస్పెండ్ చేశారని ఆరోపిస్తున్నారు. కాగా, గతంలో ఎంపీ మిథున్ రెడ్డి ఇంటిపై దాడి జరిగిన సమయంలో ఆయన గన్ మ్యాన్ ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఎంపీ మిథున్ రెడ్డి పుంగనూరు వెళ్లేందుకు ప్రయత్నించగా, ఆయనను అడ్డుకునేందుకు టీడీపీ కార్యకర్తలు పుంగనూరులో పెద్దిరెడ్డి ఇంటిని చుట్టుముట్టారు. ఆ సమయంలో మిథున్ రెడ్డి గన్ మ్యాన్ గాలుల్లో కాల్పులు జరపడంతో ఆయనను సస్పెండ్ చేశారు. దీంతో పెద్దిరెడ్డిపై కక్షతో గన్ మ్యాన్లను ఇబ్బంది పెడుతున్నారని వైసీపీ విమర్శిస్తోంది.

# డెడ్ బాడ్ డోర్ డెలవరీ కేసు.. ఎమ్మెల్సీ అనంతబాబుకు మరో షాక్



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ ఎమ్మెల్సీ అనంత బాబుకు మరో షాక్ తగిలింది. అనంత బాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసును మరో మారు విచారించాలని రాజమండ్రి ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై స్టే విధించాలని ఎమ్మెల్సీ వేసిన పిటిషన్ ను హైకోర్టు తిరస్కరించింది. దీంతో డ్రైవర్ హత్య కేసుపై సిట్ విచారణకు ఉన్నత న్యాయస్థానం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లైంది. 2022లో జరిగిన హత్య కేసులో ఎమ్మెల్సీ అనంతబాబు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అప్పట్లో అరెస్టు అయిన అనంతబాబు ప్రస్తుతం బెయిలుపై ఉన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డ్రైవర్ హత్య కేసుపై మళ్లీ సమగ్ర విచారణకు నిర్ణయించింది. దీనిపై కోర్టు అనుమతి కోసం పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వ పిటిషన్ పై విచారణ జరిపిన రాజమండ్రి ఎస్సీ, ఎస్టీ కోర్టు సానుకూలంగా స్పందించింది. డ్రైవర్ హత్య కేసుపై సిట్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ 90 రోజుల్లో చార్జిషీటు దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో అనంతబాబు బెయిలు రద్దు అయ్యే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పుపై ఆందోళన చెందిన అనంతబాబు స్టే ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు.అయితే రాజమండ్రి కోర్టు తీర్పుపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు అంగీకరించలేదు. ఫలితంగా ఎమ్మెల్సీ అనంతబాబు మరోమారు విచారణ ఎదుర్కోనున్నారు. గత ప్రభుత్వంలో ఈ హత్యోదంతం చోటుచేసుకోగా, బాధిత కుటుంబానికి న్యాయం జరగలేదని ప్రస్తుత కూటమి ప్రభుత్వం భావిస్తోంది. డ్రైవర్ హత్యపై పున:విచారణ చేపడతామని ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఆ మేరకు హతుడి తల్లి ఫిర్యాదుతో కేసును రీ ఓపెన్ చేసేందుకు చట్టబద్ధమైన చర్యలు తీసుకున్నారు. ఈ పరిణామం వైసీపీకి రాజకీయంగా ఇరకాటమే అంటున్నారు. హత్యోదంతం వెలుగుచూసిన వెంటనే వైసీపీ నుంచి అనంతబాబును సస్పెండ్ చేశారు. అయితే కొన్నాళ్లకే ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకున్నారు. దీంతో అనంతబాబుపై ఉన్న కేసు వైసీపీని రాజకీయంగా డామేజ్ చేసిందనే విశ్లేషణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కేసును మళ్లీ విచారించాలని ప్రభుత్వం నిర్ణయించడంపై వైసీపీ స్పందన ఎలా ఉండబోతోందో చూడాల్సివుంది.

# భూమనకు మరో ఉచ్చు.. ఏం జరిగింది?



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ నాయకుడు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డిపై తిరుమల తిరుపతి దేవస్థానం.. ఇప్పటికే రెండు కేసులు పెట్టింది. హిందూ ధర్మాన్ని ఆయన రెచ్చగొడుతున్నారని, తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లేలా చేస్తున్నారని ఒక కేసు పెట్టింది. తర్వాత.. అలిపిరిలోని గోశాలలో గోవులు చచ్చిపోతున్నాయనిరెండు మాసాల కిందట భూమన యాగీ చేశారు. దీనిపై అధికారులు తక్షణమే వివరణ ఇచ్చారు. అప్పట్లో మరో కేసు నమోదైంది. గోశాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని కేసు పెట్టారు.

ఇక, ఇప్పుడు రెవన్యూ అధికారులు రంగంలోకి దిగారు. భూమనకు ఉన్న స్థిరాస్తిలో కొంత భాగం శ్రీకాళహస్తి దేవాలయానికి చెందిన భూములు ఉన్నాయన్నది ప్రధాన ఆరోపణ. ఆయన తిరుపతిలో కొంత భూమిని కొనుగోలు చేశారు. అయితే.. దీనిలో సమీపంలోనే ఉన్న శ్రీకాళహస్తి భూములను కూడా కలుపుకొన్నారని.. తద్వారా.. దేవుడి భూములను కబ్జా చేశారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న రెవెన్యూ అధికారులు మంత్రి అనగాని సత్యప్రసాద్ ముందు పెట్టారు. వీటిపై విచారణ చేయించిన.. మంత్రి.. తాజాగా కేసు నమోదుకు ఆదేశాలు ఇచ్చారు. శ్రీకాళహస్తి ఆలయానికి చెందిన భూములను భూమన కబ్జా చేశారని నిర్ధారించడంతో ఆయనపై కేసు పెట్టాలని రెవెన్యూ అధి కారులను ఆదేశించారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రెండు ఎకరాల స్థలం కబ్జా కు గురైనట్టు గుర్తించామన్నారు. దీని ప్రకారం.. సదరు సర్వే నెంబర్లతో సహా.. భూమన భూమి వివరాలను పోలీసులకు అందించారు. దీనిపై కేసు నమోదు చేయనున్నట్టు తిరుపతి డీఎస్పీ తెలిపారు. అయితే.. ఇది సివిల్ కేసు కావడంతో కోర్టు కేసు నమోదు చేసే విషయంపై ఆలోచన చేస్తున్నామన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ లొల్లి.. రేవంత్ పై మంత్రులు ఢిల్లీలో ఫిర్యాదులు : కౌశిక్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి ప్రకంపనలు సృష్టిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి ఇష్టానుసారం మాట్లాడితే, ఆయన ఎవరెవరితో తిరిగారో ఆ 16 మంది పేర్లు బయటపెడతానని కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. అంతేకాదు రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్, దుబాయ్, ఢిల్లీలలో ఎక్కడెక్కడ బస చేశారో తనకు అన్నీ తెలుసని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

**మిస్ వరల్డ్ పోటీదారుల ఫోన్ల ట్యాపింగ్?**

కౌశిక్ రెడ్డి ఆరోపణల ప్రకారం.. రేవంత్ రెడ్డి ఏకంగా మిస్ వరల్డ్ పోటీదారుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. ఇవి ఆరోపణలు మాత్రమే కాదని, వాస్తవాలని ఆయన నొక్కి చెప్పారు. "ఇద్దరు మంత్రులు ఈ పొట్టోడిని ఇంకా ఎన్ని రోజులు భరించాలి అని ఫోన్‌లో మాట్లాడుకున్నది రేవంత్ రెడ్డి ట్యాప్ చేసి విన్నాడు" అని కౌశిక్ రెడ్డి వెల్లడించారు. అంతేకాదు ఆ ఇద్దరు మంత్రుల్లో ఒకరిని ఇంటికి పిలిపించుకొని, తనను ఎందుకు భరించాలి అనుకుంటున్నారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారని కూడా ఆయన తెలిపారు.

**మంత్రుల నిరసన, ఢిల్లీలో లొల్లి**

రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని మంత్రులు ఆందోళన చెందుతున్నారని, అందుకే కేబినెట్ మీటింగ్‌కు హాజరవ్వకుండా ఢిల్లీలో కూర్చున్నారని పాడి కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఉన్న తమ ఫోన్లు కూడా రేవంత్ రెడ్డి ట్యాప్ చేస్తున్నాడని మంత్రులు ఢిల్లీలో పెద్ద గొడవ చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి తెలిసి రేవంత్ రెడ్డిపై సీరియస్‌గా ఉన్నారని కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మలుపు తిరుగుతాయో వేచి చూడాలి. అధికార పక్షం ఈ ఆరోపణలపై ఎలా స్పందిస్తుందో ఆసక్తికరంగా మారింది.

# నెల్లిమర్లలో కొత్త రచ్చ.. జనసేన వర్సెస్ టీడీపీ.. !




**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన పార్టీ ఎమ్మెల్యే, నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం మాధవి వ్యవహారం మరోసారి రాజకీయంగా చర్చకు వచ్చింది. గత ఎన్నికల్లో తొలిసారి విజయం సాధించిన లోకం మాధవి ఐటీ రంగంలో వ్యాపారస్తురాలన్న విషయం అందరికీ తెలిసిందే. అమెరికా సహా స్విట్జర్లాండ్, దుబాయ్ వంటి దేశాల్లో లోకం మాధవి కుటుంబం ఐటి రంగంలో వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో తరచుగా ఆమె విదేశీ పర్యటనలో ఉంటున్నారు అన్నది జనసేన వర్గాల్లోనే చర్చి నడుస్తోంది. అయితే, స్థానికంగా పనులు మాత్రం ఎవరు చేయాలన్న విషయం ఆమె చెప్పకుండా విదేశాలకు వెళ్లిపోతుండడంతో టిడిపి నాయకులు జోక్యం చేసుకుంటున్నారు.తాజాగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నెల్లిమర్ల నియోజకవర్గంలో గత 5 రోజులుగా చేపట్టారు. సహజంగా నెల్లిమర్ల నియోజకవర్గంలో టిడిపి బలంగా ఉంది. అయినప్పటికీ గత ఎన్నికల్లో జనసేనకు కేటాయించారు. అప్పట్లోనే రెండు పార్టీల మధ్య వివాదాలు రావడం, వీటిని చంద్రబాబు, నారా లోకేష్ జోక్యం చేసుకుని సరిదిద్దడం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒకటికి రెండుసార్లు చర్చలు, సంప్రదింపుల ద్వారా ఇరు పార్టీల నాయకుల మధ్య ప్రశాంత వాతావరణ ఏర్పడేలాగా ప్రయత్నాలు అయితే జరిగాయి.

కానీ... ఈ ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. ప్రస్తుతం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నెల్లి మర్ల నియోజకవర్గంలో చేపట్టడంతో లోకం మాధవి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "నా నియోజకవర్గంలో మీరు ఎలా నిర్వహిస్తారు. ఇది మీ పార్టీ కార్యక్రమం. మాది కాదు." అంటూ ఆమె స్థానిక టిడిపి నాయకుల పై ఆగ్రహం వ్యక్తం చేయడం.. స్థానికంగా రాజకీయాలను వేడెక్కేలా చేసింది. ఈ విషయంపై మంత్రి అచ్చంనాయుడు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు.'మన పార్టీ వాళ్లు కార్యక్రమం నిర్వహిస్తే జనసేన ఎమ్మెల్యే గా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారని, దీనిపై తనకు ఫిర్యాదులు అందాయని' ఆయన చెప్పుకొచ్చారు. అయితే ఇది అంతర్గత వ్యవహారమని, పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుందామని చంద్రబాబు సర్ది చెప్పారు. కానీ వాస్తవానికి టిడిపి నాయకులు కొన్ని కొన్ని ప్రాంతాల్లోనే పర్యటించాలని తమ తమ నియోజకవర్గాలకే పరిమితం కావాలని చంద్రబాబు ఎవరికి చెప్పలేదు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాలని, ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు వివరించాలని మాత్రమే ఆయన సూచించారు. ఈ క్రమంలోనే జనసేన ఎమ్మెల్యే ఉన్నప్పటికీ టిడిపి నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇదే వివాదానికి దారి తీసింది. మరి భవిష్యత్తులో ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయి? అన్నది చూడాలి.

# పోలీసు విచారణకు కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి.. ఏం జరిగిందంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని శుక్రవారం పోలీసులు విచారించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని అవమానించేలా అసభ్యకర వ్యాఖ్యలు చేశారని మాజీ ఎమ్మెల్యేపై పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిలు తెచ్చుకున్న ప్రసన్నకుమార్ రెడ్డిని పోలీసులు సుమారు 3 గంటల పాటు విచారించారు. దాదాపు 40 ప్రశ్నలు అడిగిన పోలీసులు ప్రసన్నకుమార్ రెడ్డి నుంచి లిఖితపూర్వకంగా సమాధానాలు స్వీకరించారు. కొద్దిరోజుల క్రితం కోవూరులోని వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడిన ప్రసన్నకుమార్ రెడ్డి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై దారుణ వ్యాఖ్యలు చేసినట్లు వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో ఆయన ఇంటిపై టీడీపీ కార్యకర్తలకు దిగారు. దీంతో మరింత ఆగ్రహం చెందిన ప్రసన్నకుమార్ రెడ్డి ఎమ్మెల్యేపై తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. అయితే ఆయన వ్యాఖ్యలతో తీవ్రంగా కలత చెందిన ఎమ్మెల్యే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన పోలీసులు ప్రసన్నకుమార్ రెడ్డి అరెస్టుకు ప్రయత్నించారు. అయితే తనపై నమోదైన కేసులో అరెస్టు నుంచి రక్షించాలని నిందితుడు ప్రసన్నకుమార్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. నిందితుడిపై ఏడేళ్లలోపు శిక్ష పడే కేసులు నమోదు అవడంతో నోటీసు ఇచ్చి విచారణ జరపాలని కోర్టు ఆదేశించింది. దీంతో హైకోర్టు సూచన మేరకు ఈ రోజు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డిని పోలీసులు విచారించారు. అయితే తనపై ఫిర్యాదు చేయడాన్ని ప్రసన్నకుమార్ రెడ్డి తేలిగ్గా తీసుకున్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమన్నారు. ఇలాంటి విషయాల్లో కేసులు పెడితే జైళ్లు, కోర్టులు సరిపోవంటూ వ్యాఖ్యానించారు.

# మనోళ్లే అయినా.. చంద్రబాబుకు ఇబ్బందే ..!



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కాంట్రాక్ట్ పనులకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు పెద్ద సమస్య ఎదురయింది. ఇప్పటివరకు రాష్ట్రంలో రహదారులు, తాగునీటి, సాగునీరు ప్రాజెక్టులకు సంబంధించి దాదాపు టిడిపికి అనుకూలంగా ఉన్నటువంటి కాంట్రాక్టర్లను ఎంపిక చేసి, వారికి ఇస్తున్నారనేది పెద్ద చర్చ. సరే ఏదైతే ఏమైంది.. ప్రజలకు పనులు కావడం ముఖ్యం. ప్రభుత్వానికి తొందరగా పనులు చేయటం ముఖ్యం. అనే ఈ కాన్సెప్ట్ ని ఎంచుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కాంట్రాక్టర్లను ప్రోత్సహిస్తున్నారు. అయితే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఒక కీలక ప్రతిపాదన అటు ముఖ్యమంత్రికి, ఇటు కాంట్రాక్టర్లకు కూడా తీవ్ర సంకటంగా మారింది. ఉదాహరణకు ప్రస్తుతం ఉన్న నిబంధనలు, నియమాలను పరిశీలిస్తే ఏదైనా ఒక రహదారిని కాంట్రాక్టర్ నిర్మిస్తే దానిని మూడు సంవత్సరాల పాటు మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది. అంటే ఆ మూడు సంవత్సరాల్లో ఏదైనా లోపాలున్న, ఆ రహదారి పాడైన, ఆ కాంట్రాక్టర్ బాధ్యత వహించాలి. ఈ మూడేళ్ల కాలంలోనే ప్రభుత్వం అతనికి చెల్లించాల్సినటువంటి మొత్తాన్ని చెల్లించేస్తుంది.

అయితే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చినటువంటి కొత్త నిబంధన ప్రకారం.. 10 సంవత్సరాల పాటు కాంట్రాక్టర్ బాధ్యత వహించాలి. అది చిన్న రహదారి అయినా పెద్ద ప్రాజెక్టు అయినా సాగునీటి ప్రాజెక్టు అయినా తాగునీటి ప్రాజెక్టు అయినా కూడా సదరు కాంట్రాక్టర్ 10 సంవత్సరాలు పాటు ఆ ప్రాజెక్టుకు బాధ్యత వహించాలి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను తొలి ఐదు సంవత్సరాలు పాటు విడతల వారీగా ఇస్తారు. కాంట్రాక్టర్ ఖర్చు చేసే సొమ్మును కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాల్సి ఉంటుంది. ఈ నిధులు మాత్రం పది సంవత్సరాలు పాటు కొనసాగిస్తారు.

ఇది సమస్యగా మారింది. సాధారణంగా అంత సుదీర్ఘకాలం పాటు కాంట్రాక్టర్లు వేచి చూసే పరిస్థితి లేదు. ఎందుకంటే వారు కూడా అప్పులు తీసుకొచ్చి పనులు చేయిస్తారు. అలాగే కూలీలకు, సామాగ్రికి, యంత్రాలకు ఖర్చు పెడతారు. కాబట్టి అంత సుదీర్ఘకాలం పాటు ఎదురు చూసే పరిస్థితి వారికి కనిపించడం లేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు పదివేల కోట్ల రూపాయలకు పైగా చేపట్టాల్సిన పనులు ఆగిపోయాయి. ఇదే విషయాన్ని తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తావించారు. 'మన వాళ్లు కూడా రావడం లేదా' అని మంత్రుల వద్ద ఆయన ప్రశ్నించారు. దీనికి మంత్రులు కూడా రావడం లేదనే సమాధానం చెప్పారు. సుదీర్ఘ కాలం పాటు వేచి ఉండడం, వారు ఖర్చు చేసిన సొమ్మును 10 సంవత్సరాల పాటు నిలిపివేయడం వంటివి ప్రధాన సమస్యగా మారాయిని, దీంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని చెప్పుకొచ్చారు. అయితే ఇది కేంద్రం పెట్టిన నిబంధన అని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేయలేదని చంద్రబాబు చెప్పుకొచ్చారు.

అయితే దీనివల్ల స్థానికంగా పనులు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడడం.. మళ్లీ వచ్చే ఎన్నికల నాటికి ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాల్సి రావడం వంటివి ఇబ్బందికరంగా మరనున్నాయి. దీనికి మధ్య మార్గంగా ఏం చేయాలనే దానిపై చంద్రబాబు ఆలోచన చేస్తున్నారు.

# ద్రవిడ్, కల్లిస్‌ను బీట్ చేసిన రూట్: ఇక సచిన్ ఆల్ టైమ్ రికార్డ్‌పైనే కన్ను




**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రిటన్: ఇంగ్లాండ్ స్టార్ క్రికెటర్ జో రూట్ టెస్ట్ క్రికెట్‌లో తన హవా కొనసాగిస్తున్నాడు. రెడ్ బాల్ క్రికెట్‌లో వేల కొద్ది పరుగులు చేస్తూ దిగ్గజాల రికార్డులు బద్దలు కొడుతూ ముందుకు సాగుతున్నాడు. ఈ క్రమంలోనే రూట్ మరో అరుదైన ఘనత సాధించాడు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన మూడో బ్యాటర్?గా రికార్డ్ సృష్టించాడు. మాంచెస్టర్ వేదికగా ఇండియాతో జరుగుతోన్న నాలుగో టెస్టులో రూట్ ఈ ఘనత సాధించాడు. తద్వారా భారత మాజీ క్రికెటర్ రాహుల్ ద్రావిడ్ (13288 రన్స్), దక్షిణాఫ్రికా గ్రేట్ ఆల్ రౌండర్ జాక్వెస్ కల్లిస్ (13289) రికార్డును బద్దలు కొట్టి టెస్ట్ క్రికెట్?లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో మూడో స్థానానికి చేరుకున్నాడు. ఈ మ్యాచ్?కు ముందు టెస్టుల్లో మోస్ట్ రన్స్ చేసిన బ్యాటర్ల జాబితాలో ఈ ఇంగ్లీష్ బ్యాటర్ మూడో స్థానంలో ఉన్నాడు. రాహుల్, కల్లిస్?ను అధిగమించి మూడో స్థానానికి చేరుకోవడానికి 31 పరుగులు అవసరం కాగా మాంచెస్టర్ టెస్టులో 31 పరుగులు చేసి రాహుల్, కల్లిస్? ద్వయాన్ని బీట్ చేశాడు రూట్.

టెస్టు క్రికెట్?లో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో ఇక రూట్ కంటే సచిన్, రికీ పాటింగ్ మాత్రమే ఉన్నారు. 15921 పరుగులతో అత్యధిక టెస్ట్ రన్స్ చేసిన జాబితాలో సచిన్ టాప్ ప్లేసులో కొనసాగుతుండగా..

13378 పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాటింగ్. రూట్, పాంటింగ్ మధ్య కూడా కొన్ని పరుగుల తేడా మాత్రమే ఉండటంతో ఆస్ట్రేలియా ప్లేయర్?ను కూడా ఈ సిరీస్?లోనే రూట్ అధిగమించే అవకాశం ఉంది. ఇది జరిగితే ఇక రూట్ లక్ష్యం సచిన్ ఆల్ టైమ్ రికార్డ్ పైనే.

# మైనర్‌పై అత్యాచారం.. ఆర్‌సీబీ పేసర్ యశ్ దయాళ్‌పై మరో కేసు నమోదు

- ఇటీవలే యూపీ యువతి ఫిర్యాదు మేరకు యశ్‌పై కేసు
- తాజాగా రాజస్థాన్‌కు చెందిన మరో అమ్మాయి పోలీసులకు ఫిర్యాదు
- క్రికెట్ కెరీర్ చూపిస్తానంటూ తనపై రెండేళ్లుగా అత్యాచారం చేసినట్లు ఆరోపణ
- క్రికెటర్‌పై పోక్సో కేసు నమోదు చేసిన రాజస్థాన్ పోలీసులు



**హైదరాబాద్ పెన్ పవర్:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్టార్ బౌలర్ యశ్ దయాళ్‌పై ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యువతి ఫిర్యాదు నేపథ్యంలో ఇటీవల పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. పెళ్లి పేరుతో తనను మోసం చేశాడని, లైంగిక సంబంధం పెట్టుకున్నాడని యువతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే కోవలో తాజాగా రాజస్థాన్‌కు చెందిన మరో అమ్మాయి అతనిపై సంచలన ఆరోపణలు చేసింది. క్రికెట్‌లో కెరీర్ చూపిస్తానని నమ్మించి రెండేళ్లుగా యశ్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రాజస్థాన్ పోలీసులు ఈ పేసర్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. జైపూర్‌లో ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా తొలిసారి తాను యశ్ దయాళ్‌ను కలిసినట్లు తన ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. క్రికెట్ కెరీర్‌లో సలహాలు ఇస్తానంటూ సీతాపూరలోని ఓ హెూటల్‌కు తనను పిలిచి.. అక్కడ తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపించింది. ఆ తర్వాత నుంచి బ్లాక్‌మెయిల్ చేస్తూ రెండేళ్ల పాటు తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపింది. లైంగిక వేధింపులు మొదలైనప్పుడు ఆ అమ్మాయి వయసు 17 ఏళ్లు కావడంతో పోక్సో చట్టం కింద యశ్ దయాళ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరం రుజువైతే క్రికెటర్‌కు కనీసం 10 ఏళ్లు లేకపోతే జీవిత ఖైదు పడే అవకాశం ఉంది.

# రిషభ్ పంత్ తెగువ.. 'కుంబ్లే'ను గుర్తుకుతెచ్చింది

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్‌తో మూడో టెస్టులో చేతి వేలికి గాయం.. అయినా ఆగలేదు. ఇప్పుడు నాలుగో మ్యాచ్‌లో పాదం తీవ్రంగా గాయపడింది. ఫ్రాక్చర్ అయిందని.. బ్యాటింగ్‌కు దిగడం కూడా కష్టమని తొలుత అంతా భావించారు. కానీ, వచ్చేశాడు.. హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ తెగింపును చూస్తుంటే 2002లో అనిల్ కుంబ్లే (%ూఅఅశ్రీ ఖబఎశ్రీవ%) ఫీట్‌ను చూస్తున్నట్లు ఉందని మాజీ క్రికెటర్లు పోస్టులు పెట్టారు. దీప్ దాస్ గుప్తా, యూసఫ్ పఠాన్, ఇర్ఫాన్ పఠాన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "రిషభ్ పంత్ బ్యాటింగ్‌కు రావడం చూస్తుంటే అప్పట్లో అనిల్ కుంబ్లే తలకు కట్టుతో బౌలింగ్ వచ్చినట్లు ఉంది. పంత్ తీరు అద్భుతం" అని కామెంట్ చేశారు.



**అప్పుడు ఏమైందంటే?**

వెస్టిండీస్‌తో ఐదు టెస్టుల సిరీస్ కోసం భారత్ అక్కడికి వెళ్లింది. తొలి మ్యాచ్ డ్రా కాగా.. రెండో టెస్టులో భారత్ గెలిచింది. మూడో మ్యాచ్‌లో విండీస్ గెలిచింది. ఇక నాలుగో టెస్టు అటింగ్వా వేదికగా జరిగింది. బ్యాటింగ్‌కు అనుకూలంగా మారిన పిచ్‌పై భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 513/9 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది. వీవీఎస్ లక్ష్మణ్ (130), అజయ్ రాత్రా (115) సెంచరీలు సాధించగా.. రాహుల్ ద్రవిడ్ (91), వసీమ్ జాఫర్ (86) అదరగొట్టారు. అనిల్ కుంబ్లే బ్యాటింగ్ చేస్తుండగా దిల్లాన్ విసిరిన షార్ట్ పిచ్ బంతి తలకు బలంగా తాకింది. మైదానంలో కుప్పకూలిన కుంబ్లే.. కాసేపటికే బ్యాటింగ్ కొనసాగించాడు. దాదాపు 20 నిమిషాలపాటు ఆడాడు. మళ్లీ అతడు మైదానంలోకి దిగుతాడని ఎవరూ ఊహించలేదు. కానీ, తలకు కట్టుతో బౌలింగ్‌కు వచ్చాడు. 14 ఓవర్లు విసిరిన కుంబ్లే కేవలం 29 పరుగులే ఇచ్చి ఒక్క వికెట్ పడగొట్టాడు. అదీనూ డేంజరస్ బ్యాటర్ బ్రియాన్ లారాను ఎల్బీ చేయడం విశేషం. ఆ మ్యాచ్‌ను భారత్ డ్రా చేసుకుంది. కానీ, అనిల్ కుంబ్లే పోరాటం మాత్రం ఇప్పటికీ గుర్తుంది. అదేతరహాలో రిషభ్ పంత్ తెగువ మరోసారి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది.

**వరుసగా గాయాలైనా..**

రిషభ్ పంత్ టెస్టుల్లో ఆడుతుంటే.. క్రీజ్‌లో నాట్యం చేస్తున్నట్లే ఉంటుందనేది అభిమానుల మాట. మైదానం నలువైపులా షాట్లు కొట్టేందుకు వినూత్నంగా ప్రయత్నిస్తాడు. అలా చేసే క్రమంలోనే 'మాంచెస్టర్' టెస్టులో గాయపడ్డాడు. క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ ఆడేందుకు ప్రయత్నించాడు. కానీ, వోక్స్ యార్కర్ డెలివరీ పంత్ బ్యాట్ అంచున తాకుతూ నేరుగా పాదం మీద పడింది. నొప్పితో విలవిల్లాడిపోయాడు. పాదం అంతలావున వాచిపోయింది. రక్తం కారింది. నడిచేందుకూ ఇబ్బంది పడ్డాడు. వెంటనే అతడిని గోల్ఫ్‌కార్ట్ అంబులెన్స్‌లో డగౌట్‌కు తీసుకెళ్లారు. స్కానింగ్ రిపోర్ట్ బయటకు రివీల్ అయ్యాక అతడు ఆడటం కష్టమని అంతా భావించారు. సరిగ్గా నిలబడేందుకూ ఇబ్బంది పడిన పంత్ 'అవసరమైతే బ్యాటింగ్‌కు వస్తాడు' అని బీసీసీఐ చెప్పిన కాసేపటికే క్రీజ్‌లోకి దిగాడు. బ్యాటింగ్‌కు వస్తున్నప్పుడు పంత్‌ను అభినందిస్తూ ప్రేక్షకులు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ఓవైపు ఇబ్బంది పడుతూనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇంగ్లాండ్ బౌలర్లు ఏమాత్రం కనికరం లేకుండా పంత్ కాలినే టార్గెట్ చేసినా అతడు బెదరలేదు. జట్టు కోసం తానెప్పుడూ సిద్ధమని మరోసారి నిరూపించాడు.

# ఎంత హైటున్న హీరో అయినా ఒకే!



నిక్కీ తంబోలి చీరలో మెస్మరైజ్ చేసింది

లవ్ టుడే%-%తో టాలీవుడ్ కి పరిచయమైన యంగ్ బ్యూటీ ఇవానా గురించి చెప్పాల్సిన పనిలేదు. తొలి సినిమాతోనే అమ్మడు యువత అటెన్షన్ డ్రా చేసింది. యూత్ ఫుల్ లవ్ స్టోరీ తో కుర్ర కారులో క్రేజీ బ్యూటీగా మారిపోయింది. వైవిధ్యమైన హావభావాలతో ప్రేక్షకులకు దగ్గరైంది. ఇటీవలే %-%సింగిల్%-% తో తెలుగులోనూ లాంచ్ అయింది. ఈ సినిమా కూడా మంచి విజయం సాధించింది. కేతిక పాత్ర కంటే ఇవానా పాత్రకే మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాగే త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో ఓ ఛాన్స్ అందు కుందనే ప్రచారం జరుగుతోంది.



సక్సెస్ పరంగా ఇవానా ట్రాక్ బాగుంది. కోలీవుడ్ తో పాటు టాలీవుడ్ లోనూ పాజిటివ్ గానే కనిపి స్తుంది. యూత్ లోనూ క్రేజీ బ్యూటీగా వైరల్ అవుతోంది. %-%సింగిల్%-% తర్వాత తెలుగులో ఫాలోయింగ్ రెట్టింపు అయింది. ఇక ఇవానా వయసు విషయానికి వస్తే అమ్మడికి 25 ఏళ్లు. అంటే స్టార్ హీరోలందరితో నటించే వయసే. 20 ఏళ్ల నటే 50-40 ఏళ్ల వయసున్న హీరోలతో రొమాన్స్ చేస్తున్నారు. కాబట్టి ఇవానికి వయసు అడ్డంఢి కాదు. మరి హైట్ సంగతేంటి? అంటే అమ్మడు ఎత్తు ఐదు అడుగులే. అయినా సరే నటిగా తానెంత ఎంత పెద్ద స్టార్ అయినా....ఎంత హైట్ ఉన్నా సరే మ్యానేజ్ చేస్తానంటూ నమ్మకాన్ని వ్యక్తం చేసింది. నటికి హైట్ అన్నది పెద్ద సమస్య కాదని ధీమా వ్యక్తం చేసింది. నిజమే నిజం గా హైట్ సమస్య అయితే రష్మికా మందన్నా నేషనల్ క్రష్ అయ్యేదా? నేడు రష్మిక పాన్ ఇండియా క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. రష్మిక ఇవానా కంటే కాస్త పొడవు. 5.3 రష్మిక హైట్. కానీ కెమెరా యాంగిల్ లో రష్మిక కంటే ఇవానా ఎత్తుగా కనిపిస్తుంది. శరీరంలో కొన్ని రకాల మార్పులే ఇలాంటి వ్యత్యాసానికి దారి తీస్తుంటాయి? అన్నది తెలిసిందే. ప్రస్తుతం ఇవానా టాలీవుడ్ నే టార్గెట్ చేసి పనిచేస్తున్నట్లు తెలిపింది. ఇక్కడ అవకాశాలు వస్తే ఇక్కడే బిజీ అవ్వాలని కోరుకుంటుంది. నటిగా ఇవానాను ఎంచాల్సిన పనిలేదు. మంచి పెర్ఫార్మర్. యువ నాయికలకు బాగా సెట్ అవుతుంది. కెరీర్ ఇప్పుడే మొదలైంది కాబట్టి నిర్మాతలకు అందుబాటులో ఉంటుంది. మరి ఇవానా ప్రతిభను ఎంత మంది గుర్తిస్తారో చూడాలి.



బ్లాక్‌మెయిల్ ఈవెంట్‌లో చంద్రిక రవి భారతీయ వస్త్రధారణ

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com